
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03


నెల్లూరు, 06.11.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 23 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com




# మంత్రా... మజాకా!

## అక్రమాలకు ఆమోదం
## సహకరించిన అధికారం

**అధికారం చేతిలో వుంటే అక్రమాలైనా సక్రమం కావాల్సిందే! ఇది తరతరాలుగా వస్తున్న ఆచారం. సామాన్యుడు సెంటు స్థలాన్ని ఆక్రమించుకుంటే రాచిరంపాన పెడతారు అధికారులు. అదే అధికారపార్టీ వాళ్లు వందలు, వేల ఎకరాలను వివిధ రూపాల్లో కబ్జా చేస్తున్నా ఏమీ చేయలేరు.**

నారాయణ మున్సిపల్ మంత్రి అయ్యాక నెల్లూరు జిల్లాకు జరిగిన మేలేమీ లేదుగాని, అధికారం అడ్డం పెట్టుకుని ఆయన మాత్రం తన అక్రమాలను సక్రమం చేసుకుంటున్నాడు. ప్రస్తుతం నెల్లూరు రూరల్ చింతారెడ్డిపాలెం పంచాయితీ పరిధిలోని నారాయణ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో 40, 60, 80అడుగుల రోడ్లు 2011 మాస్టర్ ప్లాన్‌లో వున్నాయి. ఈ మూడు రోడ్ల విస్తీర్ణం రెండున్నర ఎకరాలలో వుంది. దీని విలువ 10కోట్లు దాకా వుండొచ్చని అంచనా! అయితే ఈ రోడ్లపై గతంలోనే ప్రహరీగోడ నిర్మించిన నారాయణ యాజమాన్యం తాజాగా ఈ రోడ్లను నివాసిత ప్రాంతంగా మార్చే ప్రయత్నాలు మొదలు పెట్టింది. దీనిని నివాస యోగమైన స్థలంగా మారుస్తూ ఈ నెల 3వ తేదీన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో కూడా తీర్మానం పెట్టింది. అధికార పార్టీ సభ్యుల చేత ఆమోదింపచేయించుకున్నారు. ప్రతిపక్ష వైకాపా సభ్యులు (మిగతా 11వ పేజీలో)

# శత్రువులవనున్న మిత్రులు


- ఆంధ్రా రాజకీయాలపై పడనున్న బీహార్ ప్రభావం
- టీడీపీతో తెగదెంపులకు సిద్ధమంటున్న బీజేపీ

**బీహార్ ఎన్నికల ఫలితాలు ఆ రాష్ట్ర రాజకీయాల మీదే కాదు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల మీద కూడా తీవ్ర ప్రభావం చూపనున్నాయి. అక్కడి ఫలితాలను బట్టి ఈ రాష్ట్రంలో పార్టీల మధ్య సంబంధాలు మారనున్నాయి. బీహార్‌లో బీజేపీ గెలిచినా, ఓడినా ఏపిలో బీజేపీ, టీడీపీల మధ్య పొత్తు తెగడం ఖాయంగా కనిపిస్తోంది.**



కాకపోతే ఒకటే తాడా... బీజేపీ గనుక గెలిస్తే ఆ పార్టీ వాళ్లే ఈ రాష్ట్రంలో టీడీపీని వదులుకునే ప్రయత్నం చేస్తారు. ఏపిలో సొంతంగా బలం పెంచుకోవాలనే ప్రయత్నాల్లో వుంటారు. బీజేపీ చంద్రబాబును నమ్మకమైన మిత్రుడుగా భావించడం లేదు. 2014లో స్థానిక బీజేపీ నేతలు టీడీపీతో పొత్తును నిరాకరించారు. చంద్రబాబు రిలయన్స్ అంబానీల స్థాయిలో పరపతి ఉపయోగించి పొత్తు కుదుర్చుకున్నారు. చంద్రబాబు ఈమధ్యే తెలుగుదేశంను జాతీయపార్టీగా ప్రకటించాడు. గతంలో ఆయనకు జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పి యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసిన అనుభవం వుంది. దేశంలో థర్డ్‌ఫ్రంట్ నాయకులతో సంబంధాలున్నాయి. రేపు అటు ఇటు కాకుండా ఫలితాలు వస్తే చంద్రబాబు థర్డ్ ఫ్రంట్‌ను కూడగట్టగల సమర్ధుడు. నిర్దాక్షిణ్యంగా బీజేపీని వదిలేయగలడు. ఆయన పట్ల ఈ అపనమ్మకంతోనే బీజేపీ వాళ్లు తెలుగుదేశంకు దూరమై వచ్చే ఎన్నికల నాటికి జగన్‌తో దోస్తీ కట్టాలనే ఆలోచనలో వున్నారు. ఈ క్రమంలో భాగంగానే ఆ పార్టీ రాష్ట్ర నాయకులు తెలుగుదేశం ప్రభుత్వం మీద విమర్శల దాడిని తీవ్రతరం చేసారు. ఏపికి కేంద్రం ఇంతవరకు ప్రత్యేకహోదాను ప్రకటించనిది కూడా చంద్రబాబు పాపులారిటీని పెంచకూడదనే! చంద్రబాబుతో కటీఫ్ అయ్యాకే బీజేపీ ఏపికి ప్రత్యేకహోదా ప్రకటించే అవకాశముంది. తద్వారా రాష్ట్రంలో పార్టీ బలం పెంచాలనేది ప్రణాళిక. బీహార్‌లో బీజేపీ గెలిస్తే ఏపిలో టీడీపీతో తెగదెంపులు చేసుకోవడానికి ఆ పార్టీ అధిష్టానం

(మిగతా 11వ పేజీలో)




- రాష్ట్ర రాజకీయాలలో కులం చిచ్చు

# 'కాపు' కాస్తున్న పార్టీలు

**ఉత్తరప్రదేశ్, బీహార్, కర్నాటక... కుల రాజకీయాలు ఎక్కువుగా ఉన్న రాష్ట్రాలు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వాటిని మించిపోయింది. కుల ప్రాతిపదికనే ఇప్పుడు ఇక్కడ రాజకీయాలు జరుగుతున్నాయి. మద్రాసు ఉమ్మడి రాష్ట్రం నుండి విడిపోయి ఆంధ్ర రాష్ట్రంగా, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడ్డాక ఇన్ని దశాబ్దాల చరిత్రలో రాష్ట్రంలో ఎప్పుడూ కులరాజకీయాలు లేవు. కులాల వారీగా ప్రజలు పార్టీలవైపున నిలిచిన దాఖలాలు కూడా లేవు.**

ఇందిరాగాంధీ హవాలో కులాలకతీతంగా రాష్ట్ర ప్రజలంతా కాంగ్రెస్ వైపు నిలిచారు. ఎన్టీఆర్ ప్రభంజనంలో రెడ్డి, కమ్మ, కాపు, బి.సి, ఎస్సీ, ఎస్టీ అనే తేడా లేకుండా అందరూ తెలుగుదేశంకు మద్దతునిచ్చారు. నిన్న మొన్నటి వై.యస్. హయాం వరకు కూడా రాష్ట్ర ప్రజల్లో కులం భావన లేదు. ఏపి విభజన జరిగాక కేవలం 2014ఎన్నికల నుండే రాష్ట్ర రాజకీయాల్లో కులం ఫీలింగ్ బాగా పెరిగింది. మొదటనుండి కమ్మ సామాజిక వర్గం తెలుగుదేశంకు అండగా వుండగా, కాంగ్రెస్‌లో రెడ్ల ఆధిపత్యం వుండేది. జగన్ వైకాపా పెట్టాక అధిక శాతం రెడ్లు ఈ పార్టీకి షిఫ్ట్ అయ్యారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది.

మొదట నుండి కాంగ్రెస్‌లో రెడ్లతో పాటు కాపులు కూడా బలంగా ఉండేవాళ్లు. మొన్న ఎన్నికలప్పుడు మాత్రం రెడ్లను తెచ్చుకోగలిగిన జగన్ అదే స్థాయిలో కాపులను తన వెంట తెచ్చుకోలేకపోయాడు. ఆయనకు అధికారం దక్కలేకపోవడానికి ఇదొక కారణం కూడా! చంద్రబాబు కాపులను దగ్గర చేసుకున్నాడు (మిగతా 11వ పేజీలో)

# అక్రమ నిల్వలపై దృష్టి పెట్టండి

## - జిల్లా ఎస్పీ డా॥ గజరావు భూపాల్



దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా అక్రమ నిల్వలు, అక్రమ తయారీ కేంద్రాలపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్ సిబ్బందిని ఆదేశించారు. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పని చేసి జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిబంధనలకు లోబడి టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారా? లైసెన్సులు ఉన్నాయా? తదితర వివరాలను సేకరించాలన్నారు. వ్యాపారులు ధరలు పెంచేందుకు బాణాసంచాను అక్రమంగా నిల్వ ఉంచే అవకాశం వుందని, వాటిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జనావాసాల మధ్య దుకాణాలు, గోడౌన్‌లు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. జాతీయ రహదారి వెంబడి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

***పోలీసులకు అభినందనలు:*** జిల్లాలో ఇటీవల జరిగిన వెంకటగిరి పోలేరమ్మ జాతరలోను, నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగలోనూ సమర్ధవంతంగా విధులు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అబ్దుల్ అజీజ్ కూడా పాల్గొన్నారు.

# గ్రావెల్ తవ్వకాలపై విజిలెన్స్ సీరియస్

నెల్లూరుజిల్లాలో అనధికార గ్రావెల్ తవ్వకాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టి సారించింది. మంగళవారం దగదర్తి మండలంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్రమ తవ్వకాలు భారీస్థాయిలో వుండడంతో ఈ విషయాన్ని విజిలెన్స్ ఎస్పీ రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన గ్రావెల్ తవ్వకాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో సర్వేనెంబర్ 225లో 6.69ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతి తీసుకున్నట్లు తెలిసింది. అయితే సర్వేనెంబర్లు 251, 252, 253, 254లలో సీజేఎఫ్ భూముల్లోని 18ఎకరాల్లో అక్రమంగా గ్రావెల్‌ను తరలించినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. అనుమతి వున్న 6.69 ఎకరాల్లో కూడా తీసుకున్న పర్మిట్లకు తరలించిన గ్రావెల్‌కు భారీ తేడాను అధికారులు గుర్తించారు. ఒకే పర్మిట్‌తో రోజుకు 5 నుంచి 6 ట్రిప్పులు గ్రావెల్‌ను తరలించినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్న ప్రొక్లెయిన్‌తో పాటు రెండు టిప్పర్లను అధికారులు సీజ్ చేశారు. అధికారుల అంచనా ప్రకారం ఇప్పటివరకు అక్రమంగా తరలించిన గ్రావెల్ సీనరేజ్, రాయిల్టీతో కలిపి సుమారు రూ.3కోట్ల మేర ప్రభుత్వానికి గండి కొట్టినట్లు గుర్తించారు. గ్రావెల్ తవ్వకాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జియాలజిస్టు రాము, సిఐ సంగమేశ్వరరావు, మైనింగ్ విజిలెన్స్ విభాగం ఏడి ఆనంద్, సర్వేయర్ నాగమణి పరిశీలించారు.

# మాతృభాషను మరువరాదు

---------------------------- సాయికృష్ణ యాచేంద్ర

తెలుగుభాష ఎంతో తియ్యనైన భాష అని, మాతృభాష అయిన మన తెలుగుభాషను ఎవరూ విస్మరించరాదని, మన భాషను మనం పరిరక్షించుకోవాలని సంగీత సాహిత్య సరస్వతి బిరుదాంకితులు, సంగీత గేయధార సృష్టికర్త డా. వి.బి సాయికృష్ణయాచేంద్ర అన్నారు. ఈ నెల 1న ఆయన వెంకటగిరిలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. నేటికాలంలో అనేకమంది ఆంగ్లభాషపై మోజుతో ఆ భాషకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అయితే మనం మన భాషను విస్మరించకుండా తెలుగులోనే మాట్లాడుకోవాలని ఆయన అన్నారు. నెల్లూరుకు చెందిన సింహపురి సాహితీ సమాఖ్యవారు వెంకటగిరిలోని ఆర్‌విఎం ఉన్నత పాఠశాలలో ఈ సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు తమ కవితలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సింహపురి సాహితీ సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు గణపం రాజగోపాల్‌రెడ్డి, గుర్రాల రమణయ్య, ఎ.ఎస్ కృష్ణారావు, నర్రా మీనయ్య, ఎ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు

మండల కేంద్రమైన విడవలూరులో వెలసివున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారికి ఈ నెల 1వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయం నిర్మించి ఏడాదైన సందర్భంగా స్వామివారికి నిత్యపూజలతో పాటు, పూలంగిసేవ, పల్లకీసేవలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి రవీంద్రబాబు ఉభయకర్తగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# సర్కార్ మద్యానికి మంగళం

## ● ఆరునెలల్లోనే చేతులెత్తేసిన ప్రభుత్వం



ఆర్భాటంగా ప్రభుత్వం మద్యం దుకాణాలను ఆరు నెలల క్రితం ప్రారంభించి అంతే దూకుడుగా ఎత్తేసేందుకు పచ్చజెండా వూపింది. నెల్లూరుజిల్లాలో ఈ ఏడాది నూతన మద్యం పాలసీని ప్రభుత్వం రూపొందించి అందులో మొత్తం షాపుల్లో 10శాతం షాపులను ప్రభుత్వమే నిర్వహించేటట్లు పేర్కొంది. జిల్లాలో 348 మద్యం దుకాణాలు ఉండగా అందులో 35దుకాణాలను ప్రభుత్వం (ఎక్సైజ్‌శాఖ) ఏర్పాటు చేసింది. మిగిలిన దుకాణాలను లాటరీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. నిర్వహణ బాధ్యతలు ఆయా జిల్లాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్లకు అప్పగించింది. దీంతో జూలై నుంచి ఎక్సైజ్ శాఖలోని కానిస్టేబుల్స్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. కాని వీటి నిర్వహణ అంతంత మాత్రంగానే మారింది. అన్ని రకాల బ్రాండ్‌లు అందుబాటులో లేకపోవడం, ఎక్సైజ్ సిబ్బంది సరిగా పట్టించుకోకపోవడంతో విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. మద్యం మాఫియా ఓ పథకం ప్రకారమే ఎక్సైజ్ అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చి ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వీర్యానికి నడుం బిగించింది. ఎక్కువగా వ్యాపారం జరిగే ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయకుండా అడ్డుకుంది. ప్రైవేటు మద్యం దుకాణదారులు మామూళ్ళు రావడం లేదని మరోవైపు తెలుగుదేశంపార్టీ చోటా నాయకులు ప్రభుత్వంపై కొంతకాలంగా ఒత్తిడి తీసుకొచ్చారు. వారి ఒత్తిళ్ళకు తలొగ్గిన ప్రభుత్వం ఎట్టకేలకు ప్రభుత్వ మద్యం దుకాణాల ఎత్తివేత చర్యలకు పూనుకుంది.

# డాబాల మాటున బార్లు

***నెల్లూరుజిల్లాలో కావలి నుంచి తడ వరకు గల జాతీయ రహదారి వెంబడి వుండే దాబాలు మద్యం సరఫరా చేసే బార్లను తలపిస్తున్నాయి. అల్పాహారం అందించాల్సిన ఈ దాబాలు వాటి మాటున 24గంటలు మద్యం పోస్తున్నాయి. మద్యం తాగి వాహనచోదకులు వాహనాలు నడుపుతుండడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.***



సింహపురి సమాచారం

జాతీయ రహదారిపై యధేచ్ఛగా మద్యం పోస్తున్నారు. మద్యం దుకాణాలున్న చోటే వాటికి అనుబంధంగానే దాబాలు ఏర్పాటు చేస్తున్నారు. లైసెన్స్ తీసుకున్న బార్లు ఉదయం 10గంటల నుంచి రాత్రి 11గంటల వరకు నిర్వహిస్తుంటే, అల్పాహారం కోసం ఏర్పాటు చేసిన దాబాలు నిరంతరం తెరిచే ఉంటున్నాయి. దాబాల కారణంగా జాతీయ రహదారిపై ప్రమాదాలు పెరుగుతున్నాయి. వాహనదారులు వాహనాలను దాబాల వద్ద నిలిపి మద్యం తాగి వెళుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ఈమధ్య పలుచోట్ల ప్రమాదాలు జరిగి మృతి చెందిన సంఘటనలున్నాయి. జాతీయ రహదారి వెంబడే కాకుండా రూరల్ ప్రాంతాల్లో రద్దీగా వుండే మార్గాల్లో దాబాలున్నాయి. వాహనాలు రద్దీగా వుండే కృష్ణపట్నం పోర్టు మార్గం, ముత్తుకూరు మండలం, మనుబోలు మండలం, ఆత్మకూరు, చిల్లకూరు మండలం, అంకుల పాటూరు, పొదలకూరు, సంగం తదితర మార్గాల్లోనూ దాబాలు ఎక్కువుగా ఉన్నాయి. దాబాల కారణంగా యువత మద్యానికి బానిసలవుతున్నారు. బార్లు నగరాల్లో ఉండడంతో అక్కడ తాగేందుకు జడిసి దాబాలు అనుకూలంగా కనిపించడంతో అక్కడికి వెళ్తున్నారు. యువతతో పాటు విద్యార్థులు కూడా వెళుతున్నారు. దాబాల్లో మద్యం విక్రయాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాబాలకు దగ్గర్లో వున్న విద్యాసంస్థల విద్యార్థులు పార్టీల పేరుతో దాబాలకు వచ్చి మద్యం తాగడం అలవాటుగా మారింది. ప్రమాదాలు, ఘర్షణలు, వివాదాలకు కారణమవుతున్న ఈ దాబాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎత్తిపోతల పథకానికి వైయస్సే ఆద్యుడు

## - సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి



నెల్లూరుజిల్లాలోని కండలేరు ఎడమ గట్టు కాలువ ఎత్తిపోతల పథకానికి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే టెండర్లను పిలవడం జరిగిందని వైయస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు పంచాయితీ కార్యాలయంలోని సర్పంచ్ ఛాంబర్‌లో కాకాణి విలేకర్లతో మాట్లాడుతూ వైయస్సార్ హయాంలో ఎత్తిపోతల పథకానికి టెండర్లు పిలిస్తే సింగిల్ టెండర్ దాఖలు కావడంతో రద్దు చేయడం జరిగిందన్నారు. తర్వాత సిఎంలుగా రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల హయాంలో రైతుల సాగునీటి అవసరాలకు ఎత్తిపోతల పథకం ఎంత అవసరమో తాను లేఖలు వ్రాసినట్లు తెలిపారు. ఎడమగట్టు కాలువను జలయజ్ఞంలో పూర్తి చేసిన ఘనత వైయస్సార్‌కే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పొదలకూరు రైతుల సాగుబడి అవసరాల కోసం గత నెల 30న కండలేరు ఎడమగట్టు కాలువ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయడాన్ని తమ గొప్పతనంగా కొందరు నాయకులు చెప్పుకోవడాన్ని కాకాణి తప్పు పట్టారు. ఎత్తిపోతల పథకానికి టిడిపి ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. ఎత్తిపోతల పథకాన్ని తాను సాధించినట్టు బహిరంగ చర్చకు సిద్ధంగా వున్నానన్నారు.

ఈ సమావేశంలో ఎంపిపి కోసం బ్రహ్మయ్య, సర్పంచ్ తెనాలి నిర్మలమ్మ, వైయస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, జిల్లా వైయస్సార్‌సీపీ బిసి సెల్ అధ్యక్షుడు దాసరి భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

# 'చెకుముకి' అవార్డులకు ఆహ్వానం

రత్నమ్మ ఛారిటబుల్ సొసైటీ, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ ఉదయం 10గంటలకు నెల్లూరులోని విఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టడీస్ కాలేజీలో పండిట్ నెహ్రూ జయంతి సందర్భంగా జాతీయ చాచా నెహ్రూ చెకుముకి అవార్డ్స్–2015 పోటీలను నిర్వహిస్తున్నట్లు ఈ సంస్థల అధ్యక్షులు రాచపాళెం రఘు, కె.మురళీమోహన్ రాజులు ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పోటీలను నిర్వహించి 30 మంది విజేతలకు అవార్డులు ప్రదానం చేయడం జరుగుతుందని, ఇరు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన వచ్చని, ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు నవంబర్ 10లోపు 9866179385, 9032289762 నెంబర్లను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

# క్రైమ్‌కు ఆర్‌కెఆర్

నెల్లూరు సిసిఎస్ సిఐగా ఆర్.రామకృష్ణారెడ్డిని నియమించారు. ప్రస్తుతం ఆయన రేంజ్ విఆర్‌లో వున్నారు. ఆర్‌కెఆర్ గతంలో హైదరాబాద్‌లో సీఎం సెక్యూరిటీ విభాగంలోనూ, ట్రాఫిక్‌లోనూ పనిచేశారు. నెల్లూరుజిల్లాలో ఇందుకూరుపేట, పొదలకూరు, వెంకటాచలంలలో ఎస్‌ఐగా పని చేశారు. 2013లో సిఐగా పదోన్నతి పొంది సిఐడి విభాగంలో పనిచేశారు.

కళ్యాణ వైభోగం...!

# నెల్లూరులో 'నారాయణ' పెళ్లిసందడి



రాష్ట్ర మున్సిపల్ శాఖా మాత్యులు పొంగూరు నారాయణ కుమార్తె శరణి - రవితేజ (రాష్ట్ర మానవవనరుల శాఖామాత్యులు గంటా శ్రీనివాసరావు కుమారుడు)ల కళ్యాణం అక్టోబర్ 30వ తేదీ నెల్లూరు చింతారెడ్డిపాలెంలోని నారాయణ మెడికల్ కాలేజీ క్యాంపస్ నందు వైభవంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు 18మంది మంత్రులు, చిరంజీవి, బాలకృష్ణ వంటి సినీ ప్రముఖులు, వివిధ రంగాల అగ్రగణ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ వివాహ వేడుకకు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# పేదల వైద్యానికి ముందుకురండి

## - కార్పొరేట్ ఆసుపత్రులకు కోటంరెడ్డి పిలుపు



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని దొంతాలి గ్రామంలో 4వ తేదీ సాయంత్రం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు, ప్రైవేట్ డాక్టర్లు ఈ వైద్యశిబిరంలో పాల్గొన్నారు. రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విషజ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయని, రోగులకి వైద్య సేవలు అందించే దానికి చాలినంత మంది ప్రభుత్వ వైద్యులు లేరని, ఈ పరిస్థితుల్లో సామాజిక బాధ్యతగా ప్రజల సంక్షేమం కోసం కార్పొరేట్ హాస్పిటల్స్, ప్రైవేట్ హాస్పిటల్స్ పేదవాళ్ళు నివసించే ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని కార్పొరేట్ మరియు ప్రైవేట్ హాస్పిటల్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, విస్తృతంగా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.


ఈ కార్యక్రమంలో మలినేని వెంకయ్య, సర్పంచ్, ఎంపిటిసి, నగర అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటిలో జపాన్ బృందం



జపాన్‌లోని టొయామో రాష్ట్రానికి చెందిన ఐదుగురు ఉన్నతస్థాయి సభ్యుల బృందం ఈ నెల 5వ తేదీన తడలోని శ్రీసిటి సెజ్‌ను సందర్శించింది. జపాన్ టూరిజం మరియు రీజనల్ ప్రమోషన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ యురిషిబట నేతృత్వంలో వచ్చిన ఈ బృందానికి శ్రీసిటి ఎండి రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, సెజ్‌లో కల్పించిన వసతులను వారికి వివరించారు. శ్రీసిటిలో నెలకొన్న వ్యాపారానుకూల వాతావరణం, మౌలిక వసతుల పట్ల యురిషిబట ఆనందాన్ని వ్యక్తం చేసి, శ్రీసిటి యాజమాన్యాన్ని అభినందించారు.

# మళ్లీ రానున్న సీఎం



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 21న మళ్లీ జిల్లా పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ పర్యటనంతా కూడా కృష్ణపట్నం పోర్టు తోనే ముడిపడి వుండబోతోంది. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు వద్ద సివిఆర్ ఫౌండేషన్ వారు నిర్మించిన నవనీతం స్కూలును సీఎం ప్రారంభించనున్నారు. అలాగే పోర్టులో వెస్ట్ బెర్తులను ఆయన ప్రారంభిస్తారు. నేలటూరులోని ఏపి జెన్‌కో విద్యుత్ కేంద్రంలో 3వ యూనిట్ నిర్మాణానికి సిఎం శంకుస్థాపన చేయనున్నారు. సిఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సివుంది.

# సరస్వతినగర్‌లో స్వచ్ఛభారత్



నెల్లూరులోని సరస్వతినగర్‌లో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ ప్రాంతంలోని పిచ్చిమొక్కలన్నిటినీ జేసిబితో తొలగించి పరిశుభ్రం చేశారు. ఎంతో కాలంగా ఈ ప్రాంతమంతా అపరిశుభ్రంగా వుందని, కార్పొరేషన్‌వారు పట్టించుకోకపోవడంతో, స్థానికులతో సంప్రదించి సొంత నిధులతో ఈ ప్రాంతమంతా శుభ్రపరిచామని ఈ సందర్భంగా కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కోటారెడ్డి, రవి, సలీం, లీలాకుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక చొరవ



నెల్లూరులో ముదురుదోమలు ఎక్కువై, విషజ్వరాలు విపరీతమైన నేపథ్యంలో తెలుగుదేశంపార్టీ జిల్లా అధికార ప్రతినిధి, 8వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ జడ్. శివ ప్రసాద్ పారిశుద్ధ్య పనులపై ప్రత్యేకదృష్టి పెట్టారు. తన డివిజన్ పరిధిలోని ప్రాంతాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాలలో ప్రతిరోజూ పర్యటిస్తూ పారిశుద్ధ్యంపై ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు మీ దరికి చేరవని ప్రజలకు సూచిస్తున్నారు. డెంగీ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెబుతున్నారు. నగరంలోని కాలువలపై ఆక్రమణలు ఎక్కువయ్యాయని, దీంతో ఎక్కడికక్కడ మురికి పేరుకుపోయి దోమలు అధికమవుతున్నాయని, వీటివల్లే విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా చెత్తకుండీలను ఉపయోగించాలని చెప్పారు. దోమలను లార్వా దశలోనే అరికట్టేందుకు మురికి కాలువల్లో అయిల్‌బాల్స్ వదులుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలుగునాడు విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు కె. తిరుమల నాయుడు, అమృల్లా, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

# ఈ తీరు మారాలి...

భారతీయ సంస్కృతి ఎంతో ఉదారమైనది.. విశాలమైనది. ఎన్ని రకాల వాదాలు, వివాదాలు వచ్చినా భారతదేశ ప్రజలందరూ ఒకటే అనే ఐక్యతా భావమే మనల్ని, మన అస్తిత్వాన్ని తరతరాలుగా చెక్కుచెదరకుండా నిలుపుతోంది. ఆ భావమే పరంపరంగా కొనసాగాలనేదే భారతీయులు కోరుకునేది. అంతే తప్ప, గతంలో ఎప్పుడో జరిగిన దురదృష్టకర సంఘటనలను తవ్వి తలకెత్తుకునే ధోరణి వల్ల ఒరిగేదేమీ వుండదు. ఇకనైనా ఈ తీరు మారాలి. దేశప్రగతే అందరి ధ్యేయం కావాలే తప్ప.. లేనిపోని వివాదాలతోనే పుణ్యకాలం గడిచిపోతే ఎలా?..

**భా**రతీయ సంస్కృతి ఎంతో ఉదారమైనది. ఎన్ని రకాల వాదాలు, వివాదాలు, విభేదాలు వచ్చినా మన సహజసిద్ధమైన స్వభావాన్ని మాత్రం కోల్పోకుండా భారత దేశ ప్రజలందరూ ఒకటే అనే ఐక్యతాభావమే మనల్ని, మన అస్తిత్వాన్ని చెక్కుచెదరకుండా నిలుపుతోంది. అందులోనూ సహనానికీ, దయాగుణానికి, మానవతావాదానికి ప్రతీకగా వుంటూ విశ్వశాంతిని కాంక్షిస్తూ మనదేశం ప్రపంచవ్యాప్త ఖ్యాతిని అందుకుంది. సహనం-సంయమనం, సమానభావం అన్నది భారతీయుల జన్యువుల్లోనే వుంది. ఈ విషయం ఎప్పటికీ, ఎవరూ విస్మరించలేనిది.. విస్మరించరానిది కూడా. సరిగ్గా ఈ భావాన్నే ఇటీవల భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ కూడా ప్రస్తావించారు.. అనేదానికంటే మరోసారి గుర్తుచేశారన్న మాటే సరైనది.

అవును, సహనం అనేది మన సంస్కృతి మూలాల్లోనే వుంది. దానిని విస్మరిస్తే నేల విడిచి సాము చేసినట్లే అవుతుంది. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, వర్గాలకు అతీతంగా దేశంలోని ప్రజలంతా సంఘటితంగా, సమభావంతో వుండాలని భారతీయులు ఎప్పుడూ కోరుకుంటూనే వుంటారు. తరతరాలుగా వస్తున్న మన ఘన సంస్కృతి ఇదే. అలాంటి సంస్కృతికి, సంప్రదాయాలకు ఎలాంటి అవరోధాలు ఎదురుకాకూడదని దేశప్రజలు కోరుకుంటారు. ఏ తాత్కాలిక ప్రయోజనాల కోసమో, రాజకీయాల కోసమో మన సంస్కృతికి, సంప్రదాయాలకు భిన్నమైన వాతావరణం ఏర్పడినప్పుడు ప్రజల్లో ఒక విధమైన ఆవేదన కలుగుతుంది. ప్రస్తుత రాజకీయాలను చూస్తే సరిగ్గా ఇలాంటి దురదృష్టకర పరిస్థితే ఏర్పడుతున్నట్లు కనిపిస్తోంది.

ఇప్పుడు బీహార్‌లో జరుగుతున్న ఎన్నికలు దేశవ్యాప్త రాజకీయాలకు కేంద్రబిందువుగా వున్నాయి. ఇరుపక్షాల నేతలూ తాడో పేడో తేల్చుకునేవిధంగా ఎన్నికల ప్రచారార్భాటాలు నిర్వహించుకున్నారు. విమర్శలు, ఆరోపణాస్త్రాలకు కొదవే లేదు. ఈ ప్రచారాల్లో భాగంగా ఉద్రిక్త వాతావరణలూ ఏర్పడ్డాయి. చివరికి గతంలో జరిగిన ఢిల్లీ అల్లర్లు, పంజాబ్ అల్లర్లు వంటి దురదృష్టకర సంఘటనల్ని కూడా ఇప్పుడు ప్రస్తావించుకోవడం మరింత విచారకరం. పార్టీ ఏదైనా, మతపరమైనవిగా వాటిని చిత్రీకరించి ప్రచారాలు చేసుకోవడం సము చితం కాదు. వారు ఏ పార్టీవారైనా సరే, నాయకులే సరైన బాటలో పయనించకపోవడం ప్రజలకు ఆవేదన కలిగిస్తోంది. ప్రతిదానికీ మతాన్ని జోడించి లేనిపోని రాద్ధాంతాలు చేయడం, వ్యక్తిగత ద్వేషాలతో విమర్శలు చేయడం, అన్నిటికీ మించి అన్ని విషయాలనూ ప్రజల వైపు నుంచి కాక, కేవలం రాజకీయ ప్రయోజనాలను ఆశించి చేయడం ఎవరికీ మంచిది కాదు. ఈ విషయం నేతలకు తెలియదనుకోలేం!

అయినా, ఎప్పుడో ఏదో జరిగిందని, ఎక్కడో ఎవరో ఏదో అన్నారనే అక్కసుతో, అంతకంటే ఘాటైన విమర్శలు చేయాలనే తొందరపాటుతో లేనిపోని సంచలనాల కోసం వ్యాఖ్యానాలు చేస్తుండడం వల్ల ప్రతి చిన్నవిషయం అదో పెద్ద రాద్ధాంతంగా మారిపోతోనే వుంది. అధికారపార్టీ అయిన బిజెపి, ఇంతకాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ రెండూ ఒకరిపై మరొకరు విమర్శనాస్త్రాలు సారించడంలో ఎవరికి ఎవరూ తీసిపోరు. ఎవరి అమ్ముల పొదిలో అస్త్రాలు వారికి పుష్కలంగానే వున్నాయి. మీకు అసహనం వుందని ఒకరంటే, అసహనానికి మీరే మారుపేరని ఠకీమని మొట్టికాయ వేసినట్లు మాట్లాడేవారు ఇరు పార్టీల్లో కొల్లలు.

దేశంలో మతపరమైన అసహనం పెరిగిపోతోందని, దాద్రీ వంటి ఘటనలు, గో మాంసం వివాదం.. ఇలాంటివాటి నేపథ్యంలో రచయితలు, కళాకారులు, శాస్త్రవేత్తలు కూడా అందుకు నిరసనలు తెలుపుతూ తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన పురస్కారాలను వెనక్కి ఇచ్చివేస్తుండడం మరో సంచలనం. దేశంలో మతపరమైన అసహనం పెరిగిపోతోందంటూ కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో ర్యాలీలు, ఆందోళనలు నిర్వహిస్తుంటే, అసలు కాంగ్రెస్ జన్యువుల్లోనే రాజకీయ అసహనం వుందని, కాంగ్రెస్‌లో ఆ పార్టీ నేతల్లో ప్రజాతీర్పుపై అసహనం వుందని, వారి అసలు సమస్య అదేనని, దేశంలో వున్న మంచి వాతావరణం చెడగొట్టేందుకు వామపక్ష భావాలున్నవారితో కలసి కాంగ్రెస్ ఇలాంటి కుట్రలు చేస్తోందని బిజెపి నేతల ఆరోపణ. ప్రస్తుతం దేశపరిస్థితి పూర్తిగా శాంతి యుతంగా వుందని, అయినా పురస్కారాలను తిరిగి ఇచ్చివేయడంలో సమర్థనీయ కారణం ఏదీ లేదని అధికారపార్టీ నేతలు స్పష్టీకరణ. అయితే, ఈ వాద వివాదాలన్నీ బహుశా బీహార్ ఎన్నికలతో సరి.. అనేవారూ లేకపోలేదు.

ఏదేమైనా, ప్రస్తుతం దేశంలో వున్న అనేకానేక సమస్యలను ప్రజలు, మేధావులు, నాయకులు అందరూ కలసి చర్చించుకుని, దేశాన్ని మరింతగా ప్రగతి పథంలో ముందంజ వేయించడానికి కృషి చేయాలనే పవిత్రమైన కర్తవ్యం మనందరి ముందు వుంది. మన దేశాన్ని, మన ప్రజాస్వామ్యాన్ని, మన ప్రజల సౌభాగ్యాన్నీ మనం ఎల్లవేళలా పరిరక్షించుకోవాలి. గతంలో ఎప్పుడో జరిగిన దురదృష్టకర సంఘటనలను, జరిగిపోయిన తప్పులను కావాలనే తవ్వి తలకెత్తుకోవాలనే ధోరణి ఇకనైనా సమసిపోవాలి. ఈ తీరు మారాలి! ప్రతిపక్షాలు ఎంతగా విమర్శించినా పాలకపక్షం సహనం-సంయమనంతో వ్యవహరించాలి. ఒకవేళ పొరపాట్లేమైనా వుంటే చక్కదిద్దుకుంటూ చిరునవ్వుతోనే అన్ని సమస్యలనూ అధిగమించి, సకల జనరంజకమైన పాలన అందించాలే తప్ప అధికారం వుందికదా అని తాముకూడా లేనిపోని వ్యాఖ్యలు చేస్తూపోతే వాటికి అంతే వుండదు. కవులు, కళాకారులకైనా, మేధావులు.. రాజకీయ నాయకులకైనా.. ఏ వ్యక్తికైనా.. ఎవరికైనా సరే, దేశ సౌభాగ్యం, ప్రజా సంక్షేమమే ధ్యేయం కావాలి. మనకున్న మేధాశక్తిని దేశంలో ఎన్నో అవస్థల్లో వున్న ప్రజల సంక్షేమానికి, ఎన్నో రకాల సమస్యలను అధిగమించేందుకు ఉపయోగించాలే తప్ప, లేనిపోని రాద్ధాంతాలతో ఉన్న అమూల్యమైన కాలాన్ని, ముఖ్యంగా కవి సమయాన్ని వృధా చేసుకోవడం మంచిది కాదేమో!.. విజ్ఞులు.. అనుభవజ్ఞులు ఆలోచించాలి మరి!...

## దేశ ఐక్యత ప్రదాత పటేల్

దేశ ఐక్యత ప్రదాత సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. గత నెల 31న పటేల్ జయంతిని పురస్కరించు కుని భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్ట పటేల్ నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం 565 సంస్థానాలను విలీనం చేసి ఒకే దేశంగా చేసిన ఘనత పటేల్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, బీజేపీ నగరాధ్యక్షుడు ఈశ్వరయ్య, బీజేవైయం జిల్లా అధ్యక్షుడు మొగరాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ త్యాగాలు మరువలేనివి



భారతదేశ మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గత నెల 31న నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద వున్న ఇందిరాగాంధీ విగ్రహానికి 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి పూలమాలలు వేసి నవాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిర కుటుంబం చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. కాంగ్రెస్ నాయకులు గోపి, మాధవరెడ్డి, ముసవీర్, షణ్ముగం, రాజేష్, చక్రధర్‌రెడ్డి, ముజీర్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సుజాత, షమీమ్ పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహానికి యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉడాలి సూర్యనారాయణ, కస్తూరయ్య, అజీజ్, రాజ్‌కుమార్, యూత్‌కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్యసేవలు వినియోగించుకోండి

**- జిల్లా కో-ఆర్డినేటర్ డా॥ పి.రవీంద్రనాథరెడ్డి**

హెల్త్‌కార్డు వున్న వాళ్లు ఎన్టీఆర్ వైద్యసేవ సౌకర్యం వున్న హాస్పిటల్స్‌లో సేవలను వినియోగించుకోవాలని జిల్లా కో-ఆర్డినేటర్ డా॥ పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ సౌకర్యం ఉన్న హాస్పిటల్స్ వివరాలు ఇలా వున్నాయి. 1. బొల్లినేని రామయ్య మెమోరియల్ హాస్పిటల్, 2.ఐఆర్‌సియస్ క్యాన్సర్ హాస్పిటల్, 3.జయభారత్ హాస్పిటల్, 4.కందుకూరి హాస్పిటల్, 5.నారాయణ మెడికల్ కాలేజీ హాస్పిటల్, 6.రిచ్ హాస్పిటల్, 7.సెయింట్‌జోన్స్ జనరల్ హాస్పిటల్, 8.విజయ కృష్ణ హాస్పిటల్, 9.అనసూయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, 10.అరవింద కిడ్నీ సెంటర్, 11. మాడరన్ ఐ హాస్పిటల్, 12. రెయిన్‌బో సూపర్‌స్పెషాలిటి హాస్పిటల్, 13. అభిరామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, 14. సింహపురి హాస్పిటల్, 15.లోటస్ హాస్పిటల్.. ఇవే కాకుండా 4 ప్రభుత్వాసుపత్రులు, 9 డెంటల్ హాస్పిటల్స్ ఉన్నాయి. వైద్యసేవ క్రింద 1044 జబ్బులు, హెల్త్‌కార్డు కలిగిన ఎంప్లాయిస్‌కు, జర్నలిస్టులకు 1885 జబ్బులు వర్తిస్తాయని, ఈ హాస్పిటల్స్‌లో సేవలను వినియోగించుకోవాలని రవీంద్రనాథరెడ్డి కోరారు.




## ఈ స్పందన అప్పుడేమైంది

ఇటీవల దేశంలో ఇద్దరు రచయితల మీద దాడి జరిగిందని సాహిత్యవేత్తలు, నటులు, కవులు, రచయితలు కేంద్రప్రభుత్వంపై విమర్శలు చేస్తూ తమ అవార్డులను వెనక్కిస్తున్నారు. రచయితలపై దాడులను ఎవరైనా ఖండించాల్సిందే! అయితే, రచయితలంతా మేధావులేనని, 125కోట్ల మంది ప్రజల అభిప్రాయాలకు వీళ్ల ప్రతినిధులని చెప్పలేం. ఈ దేశంలో మెజార్టీ ప్రజల మనోభావాలను గాయపరచడమే కొంతమంది సాహిత్యవేత్తల అభిమతంగా వుంది. తమ కలాలను కత్తులు కంటే పదునుగా చేసి ప్రజల గుండెల్లో పొడుస్తుంటారు. ఇలాంటి కవులను మేధావులుగా పరిగణించాల్సిన పనిలేదు. శాడిస్టులనుకోవచ్చు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తస్లీమానస్రీన్, సాల్మన్‌రష్దీ వంటి రచయితలపై దాడులు జరిగినప్పుడు దేశంలోని సాహిత్యవేత్తలంతా ఇలా అవార్డులను వెనక్కి ఎందుకివ్వలేదు. ఈ దేశంలో కులానికొక న్యాయం, మతానికొక న్యాయం అన్నట్లుగా వుంది. ఈ దుష్టసంస్కృతి పోవాలి.

**- సి.రాజీవి, నెల్లూరు.**

## ఆస్థి పన్నుల వసూళ్ళు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ప్రకారం ఎటువంటి నిర్మాణాలు లేని ఖాళీ స్థలంపై పన్ను వసూలు చట్ట విరుద్ధమని చెప్పబడింది. ఆస్థి పన్ను లెక్కింపుకు సంబంధించి 1970లో ఇదే హైకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించింది. అంతేగాక జి.హెచ్.యం.సి. నిబంధనల్లో ఖాళీ స్థలంపై పన్ను లేకుండా పన్ను వసూలు చేయరాదని హైకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే ఖాళీ స్థలం కాకుండా, అలాగే సంవత్సరాల తరబడి బీడు పడివున్న అనివాసిత భవనాలకు మాత్రం ఆస్థి పన్ను చెల్లింపు విషయంలో హైకోర్టు జోక్యం చేసుకోలేదు. కనుక నగరపాలక సంస్థ వారు ఖాళీ స్థలం కాకుండా, అనివాసిత భవనాలకు ఆస్థి పన్ను లెక్కించి వసూలు చేయడంలో ఎట్టి అభ్యంతరం లేదని పై తీర్పు వల్ల తెలుస్తోంది. కనుక నగరపాలక సంస్థ వారు నగరంలోని అనివాసిత భవనములను కనుగొని, వాటికి పేరుకుపోయిన ఆస్థి పన్నులను వసూలు చేయవలసిందిగా మనవి చేస్తున్నాము.

**ఆలూరు ఆత్మానందం, నెల్లూరు.**

## మరో తిరుమలగా గొలగమూడి

అవధూత వెంకయ్యస్వామి ఆశ్రమం మరో తిరుమలగా విరాజిల్లుతోంది. కమ్మని భోజనం, ప్రసాదాలు, రామమందిరం, ధ్యానమందిరం, కల్యాణ మండపాలు, వృద్ధాశ్రమం, అతిథి గృహాలు, గోశాలలు, వ్యాపార సముదాయాలు, ఉద్యానవనాలు, ఉన్నత పాఠశాలలు, బ్యాంకుల... గొలగమూడి స్వరూపమే మారిపోయింది. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు కూడా ఇందుకు కారకులే. స్వామివారి ఆస్తి వెయ్యి కోట్లకు చేరాలి.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**



# నరకానికి మోడల్‌గా నగరం

**• తప్పెవరిది? తప్పించుకుంటున్నదెవరు? • నగర దారిద్ర్యంలో నారాయణ తప్పు లేదా?**

రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ, నెల్లూరుజిల్లా వాడు. నెల్లూరు కేంద్రంగా ఎదిగినోడు. కాబట్టి నెల్లూరుపై కొంతలో కొంతన్నా అభిమానముంటుందనుకోవచ్చు. మంత్రి జిల్లాకు పరిమితం కాదు, అతనికి రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు ఒక్కటే అనే వాదనలోకి పోయినా ప్రతి మంత్రి కూడా తన శాఖ పరిధిలో తమ సొంత జిల్లాలకు ప్రాధాన్యత నిస్తుంటారు. కాని పురపాలక శాఖ మంత్రి నారాయణలో మాత్రం నెల్లూరు నగరం అభివృద్ధి పట్ల ఆ చిత్తశుద్ధి ఏ కోశానా కనిపించడం లేదు. ఆయన మంత్రయ్యింది మొదలు చూస్తున్నాం కదా, ఈ నెల్లూరుజిల్లా నాదికాదు, ఈ నెల్లూరుతో నాకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అర్ధరాత్రిళ్లు రావడం, సూర్యుడు రాకముందే చెక్కేయడం చేస్తున్నాడు. పుట్టింది, పెరిగింది, నడక నేర్చుకుంది, నారాయణ కాలేజీలను స్థాపించిందంతా కూడా అమరావతి లోనే అన్నట్లుగా వుంది ఆయన వ్యవహారశైలి.

మున్సిపల్ మంత్రిగా నెల్లూరుకు ఆయన నయాపైసా సాయం చేయలేదు. నగరంలో సమస్యలు దారుణంగా వున్నాయి. నగరపాలక సంస్థ ఆర్థిక పరిస్థితి దరిద్రంగా వుంది. చెత్త ఎత్తే దిక్కు లేదు. పందులను పట్టే మార్గం లేదు. ముదురుదోమలు జనం రక్తాన్ని పీపాల లెక్కన తాగుతున్నాయి. విషజ్వరాలు సోకిన నెల్లూరోళ్లతో ఇక్కడ ఆసుపత్రులే కాదు, చెన్నైలోని ఆసుపత్రులు కూడా నిండి పోతున్నాయి. నెల్లూరు ప్రజలు విషజ్వరాలతో, ఇన్ని సమస్యలతో సతమతమవుతుంటే సొంత జిల్లా మంత్రిగా కాదు, కనీసం సంబంధిత మున్సిపల్ శాఖ మంత్రిగానన్నా నారాయణ పట్టించుకున్నాడా? యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య కార్యక్రమాలకు నిధులేమన్నా కేటాయించాడా? ఏదీ లేదు. దోమలు ఇంతగా పీడిస్తున్నా, వాటి నిర్మూలనకు ఫాగింగ్ వంటివి జరిపే చర్యలు కూడా లేవు.

నగరపాలక సంస్థలో నిధులు లేకుంటే కమిషనర్ మాత్రం ఏం చేయగలడు. హాంఫట్ అనగానే నెల్లూరులో వున్న సమస్యలన్నీ మాయం కావడానికి ఆయనకు అతీంద్రీయశక్తులేమీ లేవు కదా! అసలు చేయగల అవకాశం వున్న మంత్రే తన నెల్లూరును పట్టించుకోనప్పుడు, నిమిత్త మాత్రుడైన కమిషనర్ ఏం చేయగలడు? నెల్లూరు ఇంత దరిద్రంగా వుందంటూ కమిషనర్ మీద చంద్రబాబు చిందులు వేసినంతమాత్రాన ఏం లాభం. గత కొన్నేళ్లుగా నెల్లూరు ఇలానే వుంది. ఈ కమిషనర్ నిర్వాకం వల్లే నెల్లూరు ఇంత అద్వాన్నంగా వుందనుకోవడం పొరపాటు. అధికారులను అరిచినంత మాత్రాన సమస్యలు నెల్లూరును వదిలి పారిపోవు. సదరు మంత్రివర్యులు దృష్టి పెట్టనంతకాలం నెల్లూరును దోమలు, జ్వరాలు వదిలిపెట్టిపోవు.

ముఖ్యమంత్రి గారూ...

## మాట నిలబెట్టుకోండి!



నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేదాయపాలెం గాంధీనగర్‌రోడ్డు గుంతలను 20రోజుల్లోపు పూడ్చి సరిచేయాలని, రెండు నెలల్లోగా నూతన రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను నిలబెట్టాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అధికారులను కోరారు. ఇటీవల తన కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ రోడ్డు నెల రోజులలోగా బాగు చేయిస్తానని మంత్రి నారాయణ చెప్పి 13నెలలు అవుతున్నా నేటికీ పట్టించుకోలేదన్నారు. నెల్లూరు వచ్చిన ముఖ్యమంత్రి గాంధీనగర్ రోడ్డును స్వయంగా పరిశీలించి బాగు చేయాలని అధికారులను ఆదేశించారని, అది కార్యరూపం దాల్చాలని కోరారు. గాంధీనగర్‌రోడ్డును బాగు చేయాలని గతంలో తాను పోరాటం చేయడంతో అప్పటి కమిషనర్ చక్రధర్‌బాబు రూ. 4.2కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి మంత్రి వద్ద ఉంచారని, ఇప్పటికీ అవి మంత్రి పేషీలో ఉన్నాయని గుర్తు చేసారు. నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం లోపించి దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ బారిన పడి ప్రజలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నా కార్పొరేషన్ ఏమీ చేయలేక చేతులెత్తేసిందని మండిపడ్డారు. పదిరోజుల పాటు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలో ప్రతిరోజూ ఉదయం 7గంటల నుంచి మురుగు కాలువల్లో ఆయిల్‌బాల్స్, కిరోసిన్, గంబూషియా చేపలను వదలడం, ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేయడం, అత్యవసరమైన ప్రాంతాల్లో వైద్యశిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు ప్రశాంత్‌కిరణ్, లేబూరు పరమేశ్వరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ వేమిరెడ్డి హరి శివారెడ్డి, హాజరత్‌నాయుడు, నవీన్‌రెడ్డి, పురుషోత్తమ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అరుపులతో సరి! నిధులేవి మరి?



ముఖ్యమంత్రి చంద్రబాబుకు భలే కోపం వచ్చింది. చంద్రుడు కాస్తా చండశాసనుడయ్యాడు. తనలోని ఉగ్రరూపాన్ని చూపాడు. "చూడు ఒక వైపే చూడు రెండో వైపు చూడాలనుకోకు... మాడి మసై పోతావ్" అన్న బాలయ్య డైలాగ్‌ను వినే వుంటారు. కాని ఇక్కడ చంద్రబాబు మాత్రం తన రెండోవైపు చూపించాడు. ఎదురుగా వున్న కాంట్రాక్టర్‌ను ఎడాపెడా వాయించాడు. చంద్రబాబులోని కోపాన్ని చూసి పక్కనే వున్న తెలుగు తమ్ముళ్ళంతా ఉలిక్కిపడ్డారు.

అసలు విషయానికొస్తే మంత్రి నారాయణ కుమార్తె పెళ్లి నేపథ్యంలో సిఎం చంద్రబాబు గత నెల 30వ తేదీన నెల్లూరొచ్చారు. శుభకార్యంతో పాటు స్వకార్యం కూడా నెరవేర్చుకున్నట్లు కొన్ని అధికారిక కార్యక్రమాలు కూడా పెట్టుకున్నాడు. వీటిలో భాగంగానే నెల్లూరు, సంగం బ్యారేజీల పరిశీలన. నెల్లూరు బ్యారేజీ పరిశీలించినప్పుడు సంబంధిత కాంట్రాక్టర్‌పై చంద్రబాబు నిప్పులు కక్కారు. పనులు ఆలస్యం కావడంపై తీవ్రంగా మందలిస్తూ, నేను తలచుకుంటే దేశంలో ఎక్కడా వర్క్‌లు చేయలేవని, బ్లాక్‌లిస్టులో పెడతానని హెచ్చరించారు.

మీడియా ముందు ఈ షో బాగానే వుంది. అక్కడున్న తెలుగుతమ్ముళ్లు కూడా చంద్రబాబు యాక్షన్ సీన్ చూసి ఆనందపడ్డారు. అసలు బ్యారేజీ పనులు ఎందుకు పెండింగ్‌లో వున్నాయి, ఇంతవరకు ఎందుకు పూర్తి కాలేదనే విషయం చంద్రబాబు పరిశీలించారా? పట్టిసీమపై పెట్టిన శ్రద్ధలో ఒకటోవంతు శ్రద్ధ ఈ ప్రభుత్వం నెల్లూరు, సంగం బ్యారేజీలపై పెట్టుంటే ఇదివరకే ఎప్పుడో ఇవి పూర్తై వుండేవి. 2005 సంవత్సరం అంచనా ప్రకారం ఈ బ్యారేజీ నిర్మాణం జరుగుతుంది. పిల్లర్స్ వ్యయమే బాగా పెరిగింది. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లులు చాలా మొత్తంలో పెండింగ్‌లో వున్నాయి. గత ఏడాదిన్నర కాలంలో ఈ రెండు బ్యారేజీలకు నిధులు విడుదల కాలేదు. కొత్తగా చేపడుతున్న కాలువలు, సాగునీటి పనులకు ప్రభుత్వం నిధులను ఇబ్బడి ముబ్బడిగా దోచిపెడుతోంది. అంతటి శ్రద్ధ ఈ రెండు బ్యారేజీల మీద కూడా చూపించి వుంటే చంద్రబాబు ఆవేశం తెచ్చుకోవాల్సినంత అవసరం ఉండేది కాదు.







## కేరళకు జేసీ



జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఈ నెల 9నుండి 40రోజుల పాటు కేరళలో వుండబోతున్నారు. ఆయనకు అక్కడ ఐఏఎస్ శిక్షణ వుంది. ఈ శిక్షణ పూర్త య్యాక తిరిగి విధుల్లో చేరుతారు.

## హెల్మెట్లకు మళ్లీ గడువు

నవంబర్ 1 నుండి ద్విచక్రవాహన దారులు ఖచ్చితంగా హెల్మెట్ పెట్టాలని చెప్పారు. ఆరోజు పోలీసులు, రవాణా శాఖాధికారులు జరిమానా పుస్తకాలు, క్యాష్‌బ్యాగ్‌లు పట్టుకుని రోడ్ల మీదకు కూడా వచ్చారు. వందల సంఖ్యలో బండ్లను ఆపి హెల్మెట్‌లు లేవని ఫైన్‌లు కూడా వేశారు. అయితే హెల్మెట్ తప్పనిసరి నిబంధనను ఇంకొంతకాలం పొడిగిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి మీడియాలో స్టేట్‌మెం టిచ్చారు. ఇదేదో వినాయకుడి పెళ్లిలా వుందనుకుంటూ అధికారులు జరిమానా పుస్తకాలను పక్కనపెట్టేసారు.

## వేదాయపాలెం స్టేషన్‌లో ఏటీవీఎం

నెల్లూరులోని వేదాయపాలెం రైల్వే స్టేషన్‌లో ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మిషన్(ఏటీవీఎం)ను ఏర్పాటు చేశారు. ఈ మిషన్ ద్వారా టిక్కెట్ పొందాలంటే ముందుగా రైల్వేస్మార్ట్‌కార్డును కొనాలి. టిక్కెట్ కౌంటర్ల వద్ద క్యూలో నిలబడే పని లేకుండా స్మార్ట్‌కార్డ్ ద్వారా టిక్కెట్ తీసు కుని రైలెక్కి వెళుతుండొచ్చు.

## దీపావళికి అరకిలో చక్కెర

దీపావళి పండక్కి తెల్ల రేషన్‌కార్డు దారులకు అరకిలో చక్కెరని అదనంగా ఇస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బిపిఎల్ కార్డుదారులకు కిలో కందిపప్పును 50రూపాయలకే చౌకదుకాణాలలో ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15వరకు మాత్రమే చౌకదుకాణా లలో బియ్యం, చక్కెర, గోధుమపిండి, కిరోసిన్, కందిపప్పు పంపిణీ చేస్తారని, కార్డుదారులు ఈలోపు సరుకులు తెచ్చేసు కోవాలని ఆయన కోరారు.

## సర్వశిక్షా అభియాన్‌కు నరసారెడ్డి

జిల్లా సర్వశిక్షాఅభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా నరసారెడ్డిని నియమించారు. తెలుగుగంగ అటవీ విభాగంలో ల్యాండ్ సెటిల్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న ఈయనను ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడ పి.ఓగా వున్న జి.కోదండరామిరెడ్డిని మాతృ సంస్థ అయిన హైదరాబాద్‌లోని వ్యవ సాయ విశ్వవిద్యాలయంకు బదిలీ చేశారు.

## నెల్లూరులో అవంతిక



'బాహుబలి' సిని మాలో అవంతికగా అలరించిన సినీ హీరో యిన్ తమన్నా సోమ వారం నెల్లూరీయు లకు కనువిందు చేశారు. మినీబైపాస్ రోడ్డులో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యూయలరీ షోరూంను ప్రారంభించేందుకు వచ్చిన ఆమెను చూడడానికి అభిమానులు ఎగబడ్డారు.

# నెల్లూరు కబుర్లు

## గొల్లపూడికి నాగభైరవ అవార్డు



సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు స్మారకంగా ప్రతియేట అందించే డాక్టర్ నాగభైరవ అవార్డును ఈ ఏడాది ప్రముఖ సినీ రచయిత, నటులు గొల్లపూడి మారుతీ రావు అందుకోనున్నారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 6.05గంటలకు నెల్లూరు పుర మందిరంలో జరిగే కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు డాక్టర్ నాగభైరవ అవార్డు కమిటి ప్రధాన కార్యదర్శి చిన్ని నారాయణరావు తెలిపారు. సినీ కవి వెన్నెలకంటి అధ్యక్షతన జరిగే ఈ వేడుకను 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తారు. జిల్లా ఎస్పీ గజరావ్‌భూపాల్, మాజీఎమ్మెల్యే, రాజధాని కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు, కోమిట్ల గ్రూప్ అధినేత కోమిట్ల రెనిల్‌కుమార్‌రెడ్డి, మురళీకృష్ణ 70 గ్రూప్ ఎండి వీరిశెట్టి హజరత్‌బాబు, హైదరాబాద్ ఆంధ్రప్రభ రచయిత నియోగి, సినీ దర్శకులు నాగభైరవ వీరబాబులు అతిథులుగా ఈ అవార్డు ప్రదానోత్సవంలో పాలు పంచుకోనున్నారు. ఈ వేదికపైనే సాహిత్య రంగం నుండి ఐదు మందికి నాగభైరవ స్ఫూర్తి అవార్డులను కూడా అందించనున్నారు. కార్యక్రమానికి ముందు కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరిని నిర్వహించనున్నారు.

## కావలి కాలువకు పాపన్న పేరు



సంగం ఆనకట్ట వద్ద నుండి కావలి వరకు వెళ్లే కావలి కాలువకు దివంగత నేత బెజవాడ పాపిరెడ్డి పేరు పెట్టారు. మొన్న చంద్రబాబు నెల్లూరొచ్చినప్పుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులలో పాపిరెడ్డి అగ్రగణ్యులు. స్వర్గీయ నల్లపరెడ్డి శీనయ్యకే గురువు. ఎంపి, ఎమ్మెల్యేగా ఇంకా పలు పదవుల్లో ఆయన తన సేవలందించారు. ప్రజలు ఆయనను తలచుకునేలా ఇలా కావలి కాలువకు ఆయన పేరు పెట్టడం ప్రశంసనీయం.

## రంగనాథుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి



హైకోర్టు న్యాయమూర్తి నూతి రామ్మోహన్‌రావు గత నెల 31వ తేదీన సతీసమేతంగా నెల్లూరులోని శ్రీ తల్ప గిరి రంగనాథస్వామిని దర్శించుకు న్నారు. స్వామి వారికి ఆ దంపతులు విశేషపూజలు నిర్వహించారు. అలాగే రంగనాయకమ్మ, ఆండాళ్ అమ్మవారిని, శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూడా సందర్శించి పూజలు చేసారు. ఆలయ ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఈ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

## నెల్లూరు మహిళకు 'పెటా' పురస్కారం



నెల్లూరులోని జైన్ గోల్డ్ ప్యాలెస్ అధినేత నిఖిల్ సతీమణి నిషిత జైన్ పీపుల్ ఫర్ ది ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానియన్స్ (పెటా) పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సంస్థ దేశ వ్యాప్తంగా ఇంటర్‌నెట్ ద్వారా నిర్వహించిన జీవహింసకు సంబంధించిన పోటీలలో ఇషిత జైన్ పంపిన సందేశం అత్యధిక శాతం మంది ఓటింగ్ సాధించింది. ఈ నేపథ్యంలో ఆమెను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

## ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి



ప్రతి ఒక్కరు విధిగా ఒక మొక్క నాటి సంరక్షించాలని మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి అధ్యక్షుడు సాయిబాబా అన్నారు. పర్యావరణ పరిరక్షణ ఉద్య మంలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. ఆదివారం సేవాసమితి ఆధ్వర్యంలో నెల్లూరులో మొక్కలు నాటారు.

# సలీసుగా కందిపప్పు



నెల్లూరు, పప్పులవీధిలో సలీసుగా కందిపప్పు అమ్మే కేంద్రాన్ని ఇటీవల మంత్రి నారాయణ కూతురు పెళ్లికొచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పరిటాల సునీత ప్రారంభించారు. మార్కెట్‌లో కిలో కందిపప్పు డబుల్ సెంచరీని తాకడం తెలిసిందే! పప్పు రేటు వింటే నిప్పును ముట్టుకున్నట్లే అవుతుంది. స్టోన్‌హౌస్‌పేటలోని హోల్ సేల్ మరియు రిటైల్ పప్పుదినుసుల వ్యాపారులంతా కలిసి కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. హోల్‌సేల్‌గా అయితే కిలో కందిపప్పు 140 రూపాయలు, రీటైల్‌గా అయితే 143రూపాయలకు అమ్ముతున్నారు. ఈ నెల 15దాకా ఈ పప్పు కేంద్రం నడుపనున్నారు.

## చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలి




చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు ఇందిరాభవన్‌లో ఒంగోలు చేనేత జౌళిశాఖ ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు వి.మల్లేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అపోలోలో మెగా రక్తదాన శిబిరం

నెల్లూరులోని హరనాథపురంలో వున్న అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి ఉద్యోగులు సుమారు నూరు మంది రక్తదానం చేసి. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యూనిట్ హెడ్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి వల్ల రోగికి రక్తకణాలు బాగా తగ్గిపోవడం జరుగుతుందని, రక్తం కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడిందన్నారు. రోగుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతిఒక్కరూ స్వచ్ఛంధంగా రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తమవంతుగా ఆసుపత్రి ఉద్యోగులు రక్తదానం చేశారని, భవిష్యత్తులోనూ తాము సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి జనరల్ మేనేజర్ వెంకట్ ఎస్.రావు, బ్లడ్‌బ్యాంక్ మోటివేటర్ భాస్కర్‌రావు, టెక్నీషియన్ మాధవీలత, స్టాఫ్ నర్సు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్‌కు ఉచిత వైద్యసేవలు



ఈ నెల 1వ తేదీన నెల్లూరులోని ఏసి సుబ్బా రెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో వాకర్స్‌కు ఉచి తంగా బి.పి. మరియు షుగర్ పరీక్షలు నిర్వహిం చారు. సిండికేట్ బ్యాంక్, దర్గామిట్ట బ్రాంచ్ మేనే జర్ వెంకటేశ్వరరావు షుగర్ పరీక్షలకు అవసరమైన పరికరాలను అసోసియేషన్‌కు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస కుమార్, కార్యదర్శి బి.శేషగిరిరావు, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ సత్యనాథ్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ దొరస్వామినాయుడులు బి.పి పరీక్షలు నిర్వహించారు. దద్దోలు రమణయ్య, రంగారావు, హుస్సేన్, సురేష్, పెంచలరెడ్డి, రవిచంద్ర, చంద్రమౌళి, జయదేవ్, గఫార్, నరసింహారెడ్డి తదితర వాకర్స్ పాల్గొన్నారు.

## బార్‌లకు మరో నెల గడువు

బార్‌ల లైసెన్సులను మరో నెల పొడిగించారు. ఆగష్టు నెలకు లైసెన్సుల గడువు ముగిసినా అక్టోబర్ ఆఖరు దాకా గడువిచ్చారు. ఇప్పుడు ఇంకో నెల పొడిగించారు. నెల్లూరులో 35, కావలిలో 7, గూడూరులో 3, వెంకటగిరిలో 1 మొత్తం జిల్లాలో 46 బార్లున్నాయి. వీటిలో 90%బార్లకు పార్కింగ్ లేదు. కొత్త ఎక్సైజ్ విధానం ప్రకారం బార్లకు పార్కింగ్ తప్పనిసరి. ఈ నిబంధనను కొంచెం సడలించడానికి ప్రభుత్వం బార్ లైసెన్సుల గడువును వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఫర్వాలేదనిపించిన పర్యటన





*రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గత నెల 30, 31తేదీలలో నెల్లూరుజిల్లాలో పర్యటించడం జరిగింది. 2014లో సిఎం అయ్యాక ఇంతకుముందు నాలుగుసార్లు వచ్చినా నెల్లూరుజిల్లా అభివృద్ధిపై ఆయనకు చిత్తశుద్ధి కనిపించలేదు. దానికి అనేక రాజకీయ కారణాలున్నాయి. కాని ఈసారి మాత్రం నెల్లూరు విషయంలో కాస్త శ్రద్ధ చూపినట్లు అనిపించింది. వచ్చింది మంత్రి నారాయణ కూతురు పెళ్లికే అయినా అధికారిక కార్యక్రమాలు బాగానే పెట్టుకున్నారు.*

30వ తేదీ ఉదయమే పొదలకూరులో కండ్లేరు ఎడమకాలువ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసారు. సర్వేపల్లి ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కృషితో 62కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని మొదలుపెట్టారు. ఈ పథకాన్ని ప్రారంభించిన సిఎం దీనిని ఏడాది లోపే పూర్తి చేసి రైతాంగానికి సాగునీరందిస్తామని చెప్పారు. అలాగే కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం గురించి కూడా చెప్పారు. నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టు వుందని, పరిశ్రమలు, పారిశ్రామిక కారిడార్‌లు ఈ జిల్లాలో రాబోతున్నాయని, నెల్లూరు అభివృద్ధికి ఢోకా లేదంటూ ఆయన చాలా సానుకూలంగా మాట్లాడారు. పొదలకూరు కార్యక్రమం తర్వాత ఆయన సంగం, నెల్లూరు బ్యారేజీలను పరిశీలించారు. ఈ రెండు బ్యారేజీల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుండడం చూసి ఆయనలో అసహనం పెరిగింది. రెండు బ్యారేజీల కాంట్రాక్టర్లను పిలిచి ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలని, అవసరమైన అనుమతులు, నిధులు ఇస్తామని చెప్పారు.

అదేరోజు నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర పోలీసు మెమోరియల్ సమావేశ మందిరంలో ఆయన సాగునీటి పనులు, జిల్లాలో విషజ్వరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2006 నుండి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు జరుగుతున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై మండిపడ్డారు. నెల్లూరు బ్యారేజ్ పనులు 75శాతం, సంగం బ్యారేజ్ పనులు 20శాతం మాత్రమే అయ్యాయని, ఏడాదిలో ఈ ప్రాజెక్టులు పూర్తి కావాలని సిఎం ఆదేశించారు. జిల్లాలో 270డెంగీ కేసులున్నట్లు తన దృష్టికొచ్చిందని, విషజ్వరాలను మీరు అదుపు చేయకపోతే నెల్లూరులో నేనే వచ్చి కూర్చుంటానని ఆయన హెచ్చరించారు.

31వ తేదీ ఆయన నెల్లూరు నగరంలో ఆకస్మిక పర్యటనలు జరిపారు. అధికారులు ఆయన కోసం ఒక రూటును తయారుచేసి నీటుగా సున్నం చల్లిస్తే ఆయన ఇంకో రూటులో వెళ్లారు. నగరంలో అస్తవ్యస్థంగా వున్న పారిశుద్ధ్యాన్ని చూసి ఆయనకు నరనరాన మండింది. మేయర్, కమిషనర్‌లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇకనైనా మారండి, నెల్లూరును మార్చండంటూ మందలించి వెళ్లారు.

## సిఎం పర్యటనతో సుడి తిరిగింది

**- ఎమ్మెల్సీ సోమిరెడ్డి**



కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంతో నెల్లూరు జిల్లాతో పాటు రాయలసీమ సస్యశ్యామలం కానుందని తెలుగుదేశం పార్టీ కేంద్ర పోలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రెండురోజుల పర్యటన సంతోషాన్నిచ్చిందన్నారు. కండలేరు లింకు కెనాల్, దేగపూడి బొట్లగూడ కెనాల్ లింకు కాలువ పూర్తయితే పొదలకూరు మండలంలో నీరు సమృద్ధిగా ఉంటుందన్నారు. కావలి కాలువకు బెజవాడ పాపిరెడ్డి పేరును ప్రకటించడం అభినందనీయమన్నారు. బారాషాహిద్ దర్గాను టూరిస్టు స్పాట్ కింద అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. సంగం బ్యారేజీకి రూ.165 కోట్లు, నెల్లూరు బ్యారేజీకి రూ.72కోట్లు మంజూరు చేసి ఏడాదిలోపల పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారన్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో పెన్నా, కావేరి నదులు అనుసంధానం చేయాలని కేంద్రప్రభుత్వం భావిస్తుందన్నారు. మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ అండర్ డ్రైనేజీ డిజైన్ మార్పుకు రూ.33కోట్లు అవసరమని, దీనికి సిఎం అంగీకరించారని, త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు డిజైన్ మార్పు చేసి శాశ్వత పరిష్కారం కోసం ఎల్అండ్‌టి కంపెనీతో మాట్లాడి మార్పులు చేయిస్తామని సిఎం చెప్పారని తెలిపారు. పొదలకూరురోడ్డును 4లైన్ల రోడ్డుగా చేయనున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జడ్. శివప్రసాద్, కిలారి వెంకటస్వామినాయుడు, నూనె మల్లిఖార్జునయాదవ్, తిరుమలనాయుడు, చాట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## రా... దిగిరా... దివి నుండి దిగిరా...

**● ధరలపై వైకాపా ధర్నాలతో దద్దరిల్లిన జిల్లా**



నిత్యావసర వస్తువులు ఆకాశాన్నంటుతుండడంతో సామాన్యులు, మధ్య తరగతి ప్రజల జీవన స్థితిగతులు రోజురోజుకీ దుర్భరంగా మారిపోతున్న నేపథ్యంలో, ధరల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలంటూ వైఎస్సార్సీపి ఆధ్వర్యంలో సోమవారం పెద్దఎత్తున ధర్నాందోళనలు జరిగాయి. జిల్లాలోని మండల కార్యాలయాల ఎదుట వైఎస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని ధరలను తగ్గించాలంటూ ఆందోళన నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఈ అబద్దాల ప్రభుత్వానికి చరమగీతం పాడాలని నాయకులు పిలుపునిచ్చారు. కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండల కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాందోళనలో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ధరలు మోయలేనంతగా పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వైఎస్సార్సీపి నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, ఒకవైపు జిల్లాలో పంటలు సరిగా పండక కరువు పరిస్థితులు అలుముకునివుంటే, ఈపాస్ విధానం పెట్టి ప్రభుత్వం పేదల కడుపుకొడుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ జిల్లాలో టిడిపిని బలోపేతం చేసేందుకే ప్రయత్నిస్తున్నారు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని, ఎవరెంత కుట్రలు పన్నినా ఒక్క వైఎస్సార్సీపి కార్యకర్త కూడా తమ పార్టీని వదిలి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపి నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ధర్నాందోళనలో పెద్దసంఖ్యలో వైఎస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ధరల పెరుగుదలకు నిరసనగా నినాదాలు చేశారు. అదే విధంగా, కోటలో మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట వైఎస్సార్సీపి నాయకుడు పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో, సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారధ్యంలో, ఉదయగిరిలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో, ఆత్మకూరులో ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి ఆధ్వర్యంలో, నెల్లూరు రూరల్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో, వెంకటగిరిలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి సారధ్యంలో, వెంకటాచలం మండలంలో ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ధర్నాందోళనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల్లోని వైఎస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## పేదలపాలిట పెన్నిధి ఇందిర



భారత మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా గత నెల 31వ తేదీ నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని లెప్రసి ఆసుపత్రి, టిబి ఆసుపత్రి రోగులకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరాగాంధీ పేదలపాలిట పెన్నిధి అని కొనియాడారు. 20సూత్రాల పథకం, బ్యాంకుల జాతీయకరణ, గరీబీ హఠావో లాంటి పథకాలను ప్రవేశపెట్టి పేదరికాన్ని పారద్రోలారన్నారు. భారతదేశ అభివృద్ధిలో ఇందిరమ్మ కుటుంబానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. భూసంస్కరణలు అమలు చేసిన ఘనత ఇందిరాగాంధీదేనన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు అనురాధ, పద్మావతమ్మ, లక్ష్మి, మహేష్, ఆసుపత్రి వైద్యులు త్యాగరాజన్, రహమతున్నీసా బేగం, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరుకు సీఎమ్మే సర్టిఫికేటిచ్చారు



నెల్లూరు లాంటి అధ్వాన్నపు కార్పొరేషన్ రాష్ట్రంలో ఎక్కడా లేదని ముఖ్యమంత్రే సర్టిఫికేటిచ్చారని, దీనిని గుర్తించైనా పాలకవర్గం సిగ్గు పడాలని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 1వ తేదీ నెల్లూరు ఏసి సెంటర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో పాలక వర్గం ఏర్పడి ఒకటిన్నర ఏడాది కావస్తున్నా ఎటువంటి అభివృద్ధి పని జరగలేదన్నారు. నగరంలో పారిశుద్ధ్యం లోపించింది, విషజ్వరాలు ప్రబలుతున్నాయని ప్రతిపక్షంగా మేమెన్ని సార్లు చెప్పినా మేయర్ పెడచెవిన పెట్టారని, స్వయంగా సీఎం చీవాట్లు పెట్టేదాకా తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి జ్వరపీడితుల ఇళ్లకు పోయి పాతికో, పరకో చేతిలో పెడితే సరికాదని, స్వయంగా నెల్లూరు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. అనుభవం లేని వాళ్లు పరిపాలన చేస్తే ఇలాగే ఏడుస్తుందన్నారు. ఇప్పటికైనా పాలకవర్గం మేల్కొని పారిశుద్ధ్య పనులను చేపట్టకపోతే ప్రజలతో కలిసి ఉద్యమించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఇలియాజ్, పీరారెడ్డి, మోహన్, పూర్ణ, నజీర్, సుజాత, మూలం భాస్కర్, ముజీర్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వైభవం...!



గూడూరు డిఎస్‌పి బాదిపల్లి శ్రీనివాస్ - ఇందిరల ఏకైక కుమార్తె కీర్తి - రాహుల్ (చిత్తూరు జిల్లా, పాకాల మండల వాస్తవ్యులు నిడమనూరు లక్ష్మీనారాయణచౌదరి - జ్యోతిల కుమారుడు)ల వివాహం అక్టోబర్ 29వ తేదీ నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు అత్యంత వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# ప్రత్యేకహోదా పోరాటం సాగిస్తాం




విజయవాడలో ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న విద్యార్థి జేఏసి కార్యకర్తలపై బీజేపీ నాయకుల దాడిని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఖండించారు.

2వ తేదీ నెల్లూరులో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానమంత్రి హోదా కోరుకుంటే తప్పులేదు, చంద్రబాబు ముఖ్యమంత్రి హోదా కోరుకుంటే తప్పు కాదు గాని మేము రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోరుకుంటే తప్పొచ్చిందా అని ప్రశ్నించారు. మనం ప్రజాస్వామ్య దేశంలో వున్నామా లేక హిట్లర్ పాలనలో వున్నామో అర్థం కావడం లేదన్నారు. భౌతిక దాడులతో ప్రత్యేకహోదా ఉద్యమాన్ని ఆపలేరని, విద్యార్థులతో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకహోదా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉడాలి సూర్యనారాయణ, కస్తూరయ్య, రాజ్‌కుమార్, నిషాద్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం మెరుగుపడాలి

### - మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవసేన



గూడూరు పురపాలక సంఘ పరిధి లోని ప్రజలు అంటురోగాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం పారిశుద్ధ్యం మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు పురపాలక సంఘ అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని కమిషనర్ మోదకొండ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైకాపా, తెదేపా కౌన్సిలర్లు పట్టణంలో ఏ ప్రాంతంలో చూసినా విషజ్వరాలు, టైఫాయిడ్, డెంగీ సోకి ప్రజలు కష్టాల్లో ఉన్నారని, తక్షణం ప్రతి ఒక్కరూ స్పందించాలని తెలిపారు. ప్రతి వార్డులో డ్రైనేజీ కాలువలో పూడిక తీసే కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని వైకాపా కౌన్సిలర్లు పట్టుబట్టారు. ఇందుకు తెలుగుదేశంపార్టీ కౌన్సిలర్లు స్పందిస్తూ వార్డుల్లోని కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారని చెప్పడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. అజెండాలోని పలు అంశాలను చర్చించారు. ప్రజల సమస్యలపై సక్రమంగా స్పందించడంలేదని, చర్చ జరుగుతున్న సమయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తీరుపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పురపాలక సంఘంలో రూ.కోట్లు నిధులున్నా ఏ ఒక్క పని జరగకపోవడంపై కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బి.చెంచురామయ్య, రమేష్, వి.శివకుమార్, నాశిన నాగులు, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు

# ప్రాంతీయ వైద్యశాలలో సబ్‌కలెక్టర్



ప్రాంతీయ వైద్యశాలను తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ గిరీషా

గూడూరు ప్రాంతీయ వైద్యశాలను సోమవారం సబ్ కలెక్టర్ గిరీషా తనిఖీ చేశారు. ప్రాంతీయ వైద్యశాలలో ఆసుపత్రి అభివృద్ధి నిధుల నుంచి రూ.37 లక్షలతో వివిధ పనులు, మరమ్మతులు చేస్తున్నారు. మూడురోజుల కిందట ప్రాంతీయ వైద్యశాలలో రోగులు, వైద్య సిబ్బంది మధ్య గొడవ చోటు చేసుకోవడంతో ఎలా జరిగిందన్న విషయాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ప్రస్తుతం భవనానికి రంగులు, ఇతర మరమ్మత్తు పనులు వేగంగా నాణ్యత సక్రమంగా వుండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి రోడ్లు వైపు వున్న దుకాణాలన్నింటినీ నాలుగురోజుల్లో తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆసుపత్రిలో విద్యుద్దీకరణ ఘోరంగా వుందని, తక్షణం పూర్తిగా మెరుగుపర్చాలని వైద్య విభాగం డిఇ రవిశంకర్‌ను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోదకొండ, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అమరజీవి త్యాగంతోనే తెలుగు రాష్ట్రం

### - ఆర్యవైశ్య నాయకులు చెంచురామయ్య



నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

తెలుగు ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని నేటి తరం యువత గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని ఆర్యవైశ్య నాయకులు సోమిశెట్టి చెంచురామయ్య తెలిపారు. గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం ప్రాంతంలో ఆదివారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు త్యాగంతోనే తెలుగు ప్రజలకు రాష్ట్రం వచ్చిందని ఆయన ప్రాణత్యాగం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే నవంబర్ 1వ తేదీ రాష్ట్ర అవతరణ చేపట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు బొంతల వెంకటేశ్వర్లు, వాయిగండ్ల వెంకటసుబ్బయ్య, బయ్యా మోహన్, సొల్లేటి ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈ వైద్యులు సరిగా లేరు



జ్యోత్స్నలతకు సమస్యలపై అర్జీలు ఇస్తున్న కార్యకర్తలు

జ్వరం, ఇతర అనారోగ్యంతో బాధపడుతూ వచ్చే నిరుపేదల పట్ల గూడూరు ప్రాంతీయ వైద్యశాల వైద్యులు, సిబ్బంది తీరు సక్రమంగా లేదని సబ్‌కలెక్టర్ గిరీషాకు బాధితుడు రామయ్యతో కలసి తెలుగుదేశంపార్టీ నాయకురాలు రాధాజ్యోత్స్నలత ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను ఆమె కోరారు. అంతకుముందు పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో సోమవారం పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన కార్యకర్తల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు బొల్లినేని కోటేశ్వరరావు నాయకులు గోను శివకుమార్, నర్సింహులునాయుడు, గోను విక్రం, శంకరయ్యగౌడ్, చిరంజీవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్‌ఎఫ్ నాయకుల పార్లమెంట్ ముట్టడి




మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మధు

ప్రత్యేకహోదా సాధనకు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఈ నెల 17వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో పార్లమెంట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మధు తెలిపారు. పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. అయిదేళ్ల పాటు ప్రత్యేకహోదా కల్పిస్తామని చెప్పి మాట తప్పడంతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సునీల్, సుమంత్, రసూల్, శేఖర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### చింతవరం చౌకదుకాణ

# డీలరుపై ఫిర్యాదు

గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు మండలం, చింతవరంలో చౌకదుకాణ డీలరు సక్రమంగా కార్డుదారులకు సరకులు ఇవ్వడం లేదని గ్రామస్థులు సోమవారం సబ్‌కలెక్టర్ గిరీషాకు విన్నవించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన్ను పలు ప్రాంతాలకు చెందిన అర్జీదారులు కలసి సమస్యలు విన్నవించారు. పురపాలక సంఘ కార్యాలయంలోని పలువురు అధికారులు, సిబ్బంది పనితీరుపై పలువురు కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. జ్వరాలు సోకి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నా చెత్త కూడా తొలగించడం లేదని తెలిపారు. గూడూరు, బాలాయపల్లి, సైదాపురం, చిల్లకూరు, కోట, వాకాడు, వెంకటగిరి ప్రాంతాలకు చెందిన అర్జీదారులు సమస్యలపై వినతులు సమర్పించారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అవసరానికి డబ్బు సర్దుబాటు అగుచు, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. వృత్తి వ్యాపార వర్గాలకు సామాన్య వృద్ధి, ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. మిత్రులు బంధువులు మీకు సహాయం చేస్తారు. పరిస్థితులకు అనుకూలంగా సర్దుకొని పోవలసి వస్తుంది. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక స్థితి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. అయితే శుభకార్యాలు, ప్రయాణాల వల్ల ఖర్చులు కూడా పెరుగుతాయి. చేస్తున్న పనులు మిమ్మల్ని టెన్షన్ పెట్టినా అనుకూలంగానే సాగుతాయి. అవసరాలకు డబ్బు అందుతుంది. కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. ఆహ్వానాలు అందుకుంటారు. షేర్లు లాభాలనిస్తాయి. కుటుంబసౌఖ్యముంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

చక్కని ఆలోచనలు, ప్రయత్నాలలో ఆర్థికముగా పెరుగుదలకు కృషి చేస్తారు. ఒకటి రెండు అవకాశాలు తప్పిపోయినా ఇబ్బంది ఉండదు. ఆదాయం సామాన్యం. శుభకార్య నిర్ణయాలు జరగడం, దూర ప్రయాణాలుంటాయి. కొత్త పరిచయాల వల్ల మనోధైర్యం పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలలో కొంత నిరుత్సాహం కలగడం, ఇతరులకు సహాయపడటం చేస్తారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థికాభివృద్ధికై మీరు చేసే కృషికి ప్రతిబంధకాలుంటాయి. వృత్తి పరంగా ఆదాయం బాగుంటుంది. వ్యాపార వర్గాలకు అవకాశాలు తప్పిపోవచ్చును. శుభ కార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. దూర ప్రయాణాలు ఖరారు కాగలవు. పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 06.11.2015 నుండి**
**తేది. 12.11.2015 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, సింహంలో గురువు, కన్యలో కుజ శుక్ర రాహువులు, తులలో రవిబుధులు, వృశ్చికంలో శని, సింహ కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 10 మంగళవారము నరకచతుర్దశి
తేది 11 బుధవారము దీపావళి అమావాస్య

**ముహూర్తములు లేవు.**

### ఆశ్వయుజ మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 6 | శుక్ర | దశమి | ప॥ గం.12.11వ॥ |
| తేది. 7 | శని | ఏకాదశి | ప॥ గం.2.02వ॥ |
| తేది. 8 | ఆది | ద్వాదశి | సా॥ గం.4.07వ॥ |
| తేది. 9 | సోమ | త్రయోదశి | రా॥ గం.6.18వ॥ |
| తేది. 10 | మంగళ | చతుర్దశి | రా॥ గం.8.18వ॥ |
| తేది. 11 | బుధ | అమావాస్య | రా॥ గం.10.06వ॥ |

### కార్తీకమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 12 | గురు | పాడ్యమి | రా॥ గం.11.30వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఇంటి సమస్యలు, వ్యవహార సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించగలరు. అనవసరపు ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు అభివృద్ధి ఆదాయం ఉంటుంది. నిర్మాణాలు త్వరితగతిన సాగుతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ముఖ్య విషయాలలో అవగాహన పెరిగి ఇతరులపై పట్టు సాధించగలరు. అనుకున్న పనులకు అవకాశాలు కలసి వచ్చి జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. యజమానులకు వర్కర్లతో ఇబ్బందులు రావచ్చును. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. ముఖ్యపత్రాలు, నగదు విషయాలలో జాగ్రత్తగా ఉండండి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఈ వారం ఖర్చులు ఏదో ఒక రూపంలో పెరుగుతుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం అభివృద్ధి ఉంటుంది. సోదర వర్గంతో చిన్నచిన్న సమస్యలు రావచ్చును. అవసరాలకు ధనం అందుతుంటుంది. శుభకార్య నిర్ణయాలు జరుగవచ్చును. ఉద్యోగుల సమర్ధతకు గుర్తింపు లభిస్తుంది. సేవా సంస్థలకు, సత్కర్మలకు సహాయం చేస్తారు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చేపట్టిన పనులు అనుకూలంగా జరుగుతాయి. వ్యాపార వృత్తి జీవనంలో పెరుగుదల బాగుండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. పెట్టుబడి, షేర్ల వ్యాపారాలు ఆశాజనకంగా సాగుతాయి. రావలసిన బాకీలు కొంత మేరకు చేతి కందడం, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక ఇబ్బందులు తొలగి వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి రాబడి పెరుగుతుంది. పొదుపు పథకాలపై ఆలోచనలుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఆస్తి వ్యవహారాలు వాయిదా వేసుకొనడం మంచిది. ఉద్యోగులు తమ పనులందు పొరపాట్లు రాకుండా చూచుకొనాలి. లేకుంటే ఇబ్బందులు పడతారు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఏజన్సీలు, లీజలు అవకాశాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఖర్చులు కొన్ని అదనంగా ఉండగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. మీరు ఇతరులకు సహాయ ధనము మాట రూపంలో చేస్తారు. అనుకున్న పనులను పట్టుదలతో కొనసాగిస్తారు. సభలు సమావేశాలలో మీ సూచనలు సలహాలు ఆమోద యోగ్యం కాగలవు. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలతకలదు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

తొందరపాటు నిర్ణయాలు, హామీలను ఇవ్వవద్దు. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి. షేర్లు అసంతృప్తిని కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలు గతవారం కంటే తగ్గుతాయి. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. వాహనాలు నడిపేవారు, కరెంటు యంత్రాలతో పనులు చేసే వారు జాగ్రత్తగా ఉండండి. అనుకున్న పనులకు ఆటంకాలెదురైె నిదానంగా సాగుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఖర్చులు బాగా పెరుగుతాయి. ఆర్థిక ఇబ్బందులుండినా అవసరాలకు డబ్బు సర్దుబాటు కాగలదు. ఇతరులను నమ్మి ముఖ్య పనులు అప్పగించవద్దు. మీ పర్యవేక్షణ పనుల విషయంలో ఉండాలి. వృత్తి వ్యాపారాలలో పరిస్థితి సామాన్యంగా ఉండి ఆదాయం సామాన్యంగానే ఉంటుంది. పెట్టుబడులు, షేర్లపై లాభాలుంటాయి. అనవసర వ్యవహారాలలో తల దూర్చవద్దు.

# అజీజ్ లాజిక్‌తో ఆశ్చర్యపోయిన బాబు

శ్రీను గల్పిక

హైదరాబాద్‌లో హైటెక్‌రత్న, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం. "జన్మ భూమి నా దేశం నమో నమామి" అనే పాట రింగ్ టోన్‌తో సెల్‌ఫోన్ మోగింది. నిద్ర మత్తులోనే చంద్రబాబు ఫోన్ ఎత్తాడు. అవతల నుండి మాటల మాంత్రికుడు, ప్రధాని నరేంద్రమోడీ... చంద్రబాబూజీ, మీ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇద్దామనుకుంటున్నాను, మీకు హ్యాపీయే కదా అని అన్నాడు. ఆ మాటతో చంద్రబాబు ఉలిక్కిపడ్డాడు. నిద్ర మత్తు మాయమైంది. వెంటనే ఆయన... మోడీజీ, మీరు ఆ పని చేయకండి, ఇప్పుడు మీరు ప్రత్యేకహోదా ఇస్తే ఆ జగన్ నిరాహార దీక్ష చేసాడు కాబట్టి మీరిచ్చారనే ప్రచారం చేస్తారు. మాకు ప్రత్యేకహోదా వద్దు, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి. అసలే ఆర్థిక ఇబ్బందుల్లో వున్నాం. సింగపూర్ లాంటి రాజధానినన్నా కట్టుకుంటామన్నాడు. అందుకు మోడీ... సరే, మీ ఇష్టాన్ని నేనెందుకు కాదంటాను, కోటో, రెండు కోట్లో ప్రత్యేకప్యాకేజీ ఇస్తాలే అంటూ ఫోన్ పెట్టేసాడు. చంద్రబాబు హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకుని... నెల్లూరులో నారాయణ పెళ్లికెళ్లాలి, ఫ్లైట్ రెడీ చేయమనండి అని సి.ఎస్ కృష్ణారావుకు చెప్పాడు. ఈ వయసులో మన మంత్రి నారాయణ మళ్లీ పెళ్లి చేసుకుంటున్నాడా అని కృష్ణారావు ఆశ్చర్యంగా నోరెళ్లబెట్టి అడిగాడు. చంద్రబాబు కోపంగా... మీ ఆశ్చర్యం ఏడ్చినట్లే వుంది, నారాయణ పెళ్లి అంటే నారాయణకు కాదు, వాళ్లమ్మాయి పెళ్లికి అని చెప్పి రెడీ కావడానికి లోపలకు వెళ్లాడు.

★★★★★

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల ఉత్పత్తి కేంద్రంగా ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన నెల్లూరు నగరం. పోలీస్ పరేడ్ గ్రౌండ్. తెలుగుదేశం నాయకులంతా చంద్రబాబుకు స్వాగతం పలకడానికి వేచి చూస్తున్నారు. కాకపోతే గ్రూపులు గ్రూపులుగా వున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర అందరితో... రోజూ మనలో మనం గొడవలు పడడం రివాజు... కాని ఈ ఒక్క రోజన్నా ఆయన ముందు ఐక్యంగా ఉన్నట్లు నటిద్దామన్నాడు. దానికి మిరపకాయ్ సోమిరెడ్డి ఒప్పుకోలేదు. రోజూ ఎలా వుంటున్నామో ఈరోజూ అలానే వుందాం, ఒక్కరోజు ప్రేమలు, అభిమానాల మీద నాకు ఆసక్తి వుండదన్నాడు. నారాయణ, ఆదాల కూడా అది కరెక్టేనని సమర్ధించారు. మీపని ఇలా కాదని చెప్పి రవిచంద్ర అప్పటికప్పుడు 5లీటర్ల ఫెవికాల్ డబ్బాను తెప్పిచ్చాడు. అందరి చేతులకు పూసి నారాయణ చేతిలో సోమిరెడ్డి చేతిని, ఈయన ఇంకో చేతిలో ఆదాల చేతిని, పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేతిలో పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి చేతిని, అబ్దుల్ అజీజ్ చేతిలో డాక్టర్ జడ్.శివ ప్రసాద్ చేతిని, మెట్టుకూరు ధనుంజయరెడ్డి చేతిలో గూటూరు కన్నబాబు చేతిని పెట్టాడు. దాంతో ఆ చేతులు అతుక్కుపోయాయి. ఇక చచ్చినట్లు మీరంతా కలిసే వుంటారు. చంద్రబాబు పర్యటన ముగిసే దాకా మీరిలాగే వుండండని రవిచంద్ర అన్నాడు. అప్పుడు ఆదాల... రవీ ఈ ఫెవికాల్ చేతులను కలపగలదేగాని మనసులను కలపగలడా, ఎందుకీ వృధా ప్రయత్నమని అడిగాడు. నా కోసం, మన చంద్రన్న కోసం ఓ గంట ఇలాగే వుండండని బీద బ్రతిమలాడడంతో అందరూ సరేనన్నారు.

అప్పుడే గ్రౌండ్‌లో హెలికాప్టర్ ల్యాండయ్యింది. చంద్రబాబు దిగాడు. ఒకరి చేతులొకరు పట్టుకుని నాయకులంతా ఆయనకు స్వాగతం పలికారు. ఒకరిని విడిచి ఒకరం వుండలేమన్నట్లుగా చేతులు పట్టుకుని కనిపించిన జిల్లా నాయకులను చూసి ఆనందంతో చంద్రబాబు కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. వారితో ఆయన... మీ అన్యోన్యత చూస్తుంటే నాకు తెగ సంతోషమేస్తోంది, కలకాలం ఇలాగే వుండండని అన్నాడు. అంత టైం లేదు సార్, మహా అంటే ఇంకో గంట ఉండగలరు, వాళ్లు ఒప్పుకున్న టైం అంత వరకే అని బీద అన్నాడు. గంట సేపేంటి... అని చంద్రబాబు ఆశ్చర్యంగా అడిగాడు. బీద నాలిక్కరుచుకుని పొరపాటున నిజం మాట్లాడేసానని మనసులో తిట్టుకుంటూ... దానిని కవర్ చేసుకోవడానికి... అంటే ఒకరి చేతులు ఒకరు పట్టుకుని గంటకంటే ఎక్కువసేపు వుంటే చేతులు నొప్పి పుడతాయి కదా సార్, అందుకే గంటకంటే ఎక్కువసేపు అలా వుండలేరని చెప్పానన్నాడు. తర్వాత చంద్రబాబు... పెళ్లి రాత్రికి కదా, ఈలోపు నాకు పనులేమీ లేవు, ఎక్కడన్నా తిరుగుదాం, నాకు బాగా కోపం వచ్చి అధికారులను తిట్టడానికి అవకాశం వున్న పనులేమన్నా వుంటే చూడండని అడిగాడు. వెంటనే ముంగమూరు... సార్ పెన్నా బ్యారేజీని చూసొద్దామన్నాడు. చంద్రబాబు సరేననడంతో అందరూ అక్కడకు చేరుకున్నారు. అసంపూర్తిగా వున్న బ్యారేజీ పనులను చూసి చంద్రబాబుకు ఒళ్లు మండింది. వెంటనే కాంట్రాక్టర్‌ను పిలిచి... ఏం తమాషాలు చేస్తున్నారా, పనులెందుకు పూర్తి చేయలేదు, నిన్ను బ్లాక్‌లిస్టులో పెడతా, జాగ్రత్త అని హెచ్చరించాడు. దానికి ఆ కాంట్రాక్టర్... బ్లాక్ లిస్టులో కాకపోతే బ్లూ, రెడ్ లిస్టులో కూడా పెట్టండి, నాదేం పోతుంది, ముందు చేసిన పనికి బిల్లులిప్పించండి, పట్టిసీమ మీద చూపిన శ్రద్ధ దీనిమీద కూడా చూపండి, డబ్బులు లేకుండా పనులెలా చేయాలని అడిగాడు. వెంటనే చంద్రబాబు సిఆర్‌డిఏ మ్యాప్ తీసి... ఇదేంటో తెలుసా, సింగపూర్ లాంటి అమరావతి రాజధాని, రూపాయి లేకుండా కేవలం సంకల్పబలంతోనే దీని నిర్మాణం మొదలుపెట్టాం. ఏదన్నా పూర్తి చేయాలంటే సంకల్పం వుండాలి గాని డబ్బు కాదన్నాడు. నేనూ సీఎంనైతే ఇలాంటివి నిముషానికొకటి చెబుతానని ఆ కంట్రాక్టర్ మనసులో అనుకున్నాడు. చంద్రబాబు అక్కడ నుండి బయలుదేరాడు. దారిలో ఒక చోట నిమ్మకాయసోడా తాగాడు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద కారాపి వేరుశెనక్కాయలు కొనుక్కుని తిన్నాడు. ఓ గంటపాటు నెల్లూరు రోడ్ల మీద తిరిగి అన్నీ పరిశీలించి కార్పొరేషన్ ఆఫీసుకు చేరాడు.

★★★★★

ఇక్కడ రివ్యూ మీటింగ్... నేను నగరమంతా పర్యటించాను, చాలా దరిద్రంగా వుంది. పారుశుద్ధ్యం చెత్తగా వుంది. పందులు రోడ్ల మీదే తిరుగుతున్నాయి. అసలు మీరేం చేస్తున్నారంటూ మేయర్ అజీజ్‌ను, కమిషనర్ పివిఎస్ మూర్తిని నిలదీసాడు చంద్రబాబు. దానికి అజీజ్... సార్, మీరు నగరం దరిద్రంగా వుండడం గమనించారేగాని, అసలు మేము నగరాన్ని అలా వుంచడం వెనుక ఉద్దేశ్యాన్ని మీరు గమనించినట్లు లేదు. నగరంలో ముదురుదోమలను మేమే అభివృద్ధి చేస్తున్నాం, అవి కరిస్తే జనాలకు జ్వరాలొస్తాయి. ఆసుపత్రులలో వుంటారు. అప్పుడు వాళ్లకు జ్వరమే పెద్ద సమస్య. కాబట్టి ఇంట్లో నీళ్లొస్తున్నాయా, కరెంట్ వుందా, పన్నులు పెంచారా? రోడ్లు వేసారా? కాలువలు తవ్వారా? వంటి సమస్యల గురించి అసలు ఆలోచించరు. అలాగే నగరంలో చెత్తను ఎత్తేయడం పూర్తిగా మానేసాం. ఇది ప్రజల్లో పరివర్తన కోసమే. వాళ్ల సందుల్లో ఎంత కాలమని చెత్తకంపును భరిస్తూ ప్రజలుండగలరు? ఇప్పుడు జనం వారిళ్లల్లో చెత్తే కాదు, వీధుల్లో చెత్తను సైతం స్వయంగా కంపోస్ట్ యార్డ్‌లకు పంపిస్తున్నారు. ఎవరి ఇళ్ల ముందు కాలువల్లో మురికిని వాళ్లే తీసుకుంటున్నారు. డెంగీ జ్వరాలు ఎంత ఎక్కువ మందికి వస్తే అంత ఎక్కువమంది మన గురించి ఆలోచించడం మానేస్తారని చెప్పాడు. అజీజ్ చెప్పిన లాజిక్‌కు చంద్రబాబుకు తల తిరిగినంత పనైంది. ఇతనిపై ఓ కన్నేయకుంటే ఎప్పుడో ఒకసారి తన కుర్చీ క్రిందకే నీళ్లు తెస్తాడనుకున్నాడు. అంతలో అక్కడకు బ్లాక్ కమెండోస్ వచ్చి, సార్, మీరు తొందరగా పెళ్లి చూసుకుని బయల్దేరడం మంచిదని చంద్రబాబుకు చెప్పారు. ఏం మావోయిస్టులు, ఐఎస్ఐ ఉగ్రవాదుల జాడలున్నాయని ఐ.బి హెచ్చరించిందా? అని చంద్రబాబు అడిగాడు. ఆ ఉగ్రవాదులతో పోరాడి తరిమేయగలం సార్, కాని నెల్లూరు ముదురుదోమలతో పోరాడే శక్తి మాకు లేదు. వాటిని నిర్మూలించే ఆయుధాలు కూడా ఇంకా కనిపెట్టలేదు, ఒకవేళ ఈ రాత్రికి మీరిక్కడే వుండాలనుకుంటే మేం మాత్రం వుండం, మాకు భార్యాబిడ్డలున్నారని అన్నారు. భార్యాబిడ్డలు మీకేనా, మాకు మాత్రం లేరా, పెళ్లి చూసుకుని నేనూ వస్తా అంటూ చంద్రబాబు లేచాడు.

# కల్యాణ వైభవం...!



ఒంగోలులోని హోటల్ సరోవర్ అధినేత డాకా కోటిరెడ్డి - అనూరాధల కుమారుడు **కార్తిక్ - స్వాతి** (విశాఖపట్నం వాస్తవ్యులు కోటు మహేంద్రరెడ్డి - నందినిల కుమార్తె)ల కల్యాణం అక్టోబర్ 30వ తేదీ విశాఖలోని సెంటినరి ఆడిటోరియంలోను, రిసెప్షన్ ఈ నెల 1వ తేదీ నెల్లూరు అనిల్ గార్డెన్స్ నందు వైభవంగా జరిగాయి. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు వాస్తవ్యులు బండాత్మకూరు లక్ష్మీ నరసింహ ప్రసాద్ - సత్యవతిల కుమార్తె **శ్రావణి - వెంకట శివరామకృష్ణ** (శ్రీకాళహస్తి వాస్తవ్యులు కురువాడ నాగభూషణం - వళ్ళీదేవిల కుమారుడు)ల పరిణయం అక్టోబర్ 25వ తేదీ తిరుచానూరులోని శ్రీనివాస కల్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# పరిశుభ్రతతోనే రోగాల నివారణ

**- ఎమ్మెల్యే పి.అనిల్**



ఈ నెల 4న నెల్లూరు నగరం, 45వ డివిజన్‌లోని రామమూర్తి నగర్, కర్ణాలమిట్టలో వున్న మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లోని విద్యార్థులకు మినర్వా హోమియో కేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో డెంగ్యూ నివా రణకు నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌లు హోమియో మందులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ డెంగ్యూ నివారణకు మినర్వ హోమియో కేర్ వారి సౌజన్యంతో నెల్లూరు నగర నియోజకవర్గంలోని అన్ని మున్సిపల్ హైస్కూళ్లలో హోమియోపతి మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త కుండీలలో మాత్రమే వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ దోమలను నిర్మూలించడంలో కార్పొరేషన్ పూర్తిగా విఫలమవడంతో వారు చేయవలసిన పనిని నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్ కుమార్‌యాదవ్ స్వంత నిధులతో చేస్తున్నారన్నారు. డెంగ్యూ ప్రజల అజాగ్రత్త వలన వస్తుందని కౌన్సిల్ సమావేశంలో మేయర్ అనడం బాధాకరమని, కార్పొరేషన్ చేయవలసిన పనిని సక్రమంగా చేయకపోవడంతో అనేకమంది ప్రజలు అనారోగ్యం పాలౌతున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ అశోక్, వైయస్సార్సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మునీర్‌సిద్ధిక్, యువజన విభాగ నగర అధ్యక్షుడు గంధం సుధీర్‌బాబు, దార్ల వెంకటేశ్వర్లు, దేవిశెట్టి రాజగోపాల్, బుడిగ వాసు, కరేటి శ్రీధర్, నక్కా శ్రీనివాసులు, బాలయ్య, శ్రీకాంత్, సుధా, కొప్పోలు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## అర్చన ఆధునీకరణ



నెల్లూరులో మాగుంటోళ్ల సినిమాహాళ్లలో అర్చన డిటియస్ చాలా పాతది. ఒకప్పుటి రంగమహల్, శేషమహల్‌లలో ఒకదానిని అర్చనగా తీర్చిదిద్దారు. చాలా ఏళ్ళ తర్వాత ఇప్పుడు అర్చనను ఇంకా ఆధునీకరించడం కోసం తాత్కాలికంగా మూసివేశారు. ఇప్పటికే మూడు హాళ్ళను ఎస్2గా మార్చడంతో పాటు లీలామహల్‌ను కూడా అత్యాధునికంగా రూపుదిద్దిన మాగుంట కుటుంబీకులు ఇప్పుడు అర్చనను కూడా అదే తరహాలో అందంగా ముస్తాబు చేసి మళ్లీ ప్రేక్షకుల ముందుకు తేనున్నారు.



## కావలి కబుర్లు

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద**




ప్రజలు తమ వ్యక్తిగత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దాని ద్వారా విషజ్వరాలు సృష్టించే దోమలు తగ్గుతాయని కావలి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు ప్రజలకు సూచించారు. ఆదివారం పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌లో బిఎంఆర్ ఛారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో టిఎన్‌సియుపి సభ్యులు సుమారు 20మంది ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో విషజ్వరాలు బారిన పడి అనేకమంది చనిపోతున్నారని, జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిస్థితులను గమనించి అత్యవసర వైద్యం అందించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేసి పారిశుద్ధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పేద ప్రజల ఆరోగ్యం బాగుండాలనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ప్రజల శ్రేయస్సు కోసం ఎన్నో వైద్య శిబిరాలు బిఎంఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేశామన్నారు. ఈ విషజ్వరాలు తగ్గు ముఖం పట్టేవరకు స్థానిక వైద్య సిబ్బందిచే వైద్య సేవలు అందించటమే కాక తాను కూడా వైద్యశిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం టిడిపి ఆరోగ్య విభాగం రాష్ట్ర నాయకులు డా॥ జడ్.శివప్రసాద్ పరిసరాల శుభ్రత, డెంగ్యూ వంటి విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట స్థానిక పిహెచ్‌సి వైద్యులు డా॥ వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి అమరా వేదగిరి, ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, శ్రీనివాస కిరణ్, జి.భరత్‌కుమార్, ఏఎంసి డైరెక్టర్ తిరువీధి ప్రసాద్, టిడిపి నాయకులు పి.అలేఖ్య, శ్రీకాంత్, కిషోర్, శ్రీహరినాయుడు, ఆత్మకూరు బ్రహ్మయ్య, పి.శ్రీనివాసులు, హజరత్, రవిశేఖర్, కె.లక్ష్మి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

**• కొత్త సినిమాలతో...**

# కావలి హాళ్లలో నిలువు దోపిడీ

## నిబంధనలకు తూట్లు... రెండింతలవుతున్న టిక్కెట్ రేట్లు






కొత్త సినిమా విడుదలవుతుందంటే చాలు... కావలి పట్టణంలోని సినిమా థియేటర్లలో వున్న టిక్కెట్ల ధరలు టక్కున మారిపోతాయి. 10రూపాయల టిక్కెట్ 20రూపాయలవుతుంది, 20టిక్కెట్ 40, 30 టిక్కెట్ 60, 50 టిక్కెట్ 100రూపాయలుగా మారుతోంది. కొత్త సినిమా పాతబడే వరకు, రద్దీ తగ్గేవరకు ప్రేక్షకులను ఇదే విధంగా దోచుకుంటుంటారు. అదేమంటే ఆర్డీఓను అడిగి టిక్కెట్ల రేట్లు పెంచుకోవడానికి ప్రత్యేక అనుమతి తెచ్చుకున్నామని దబాయిస్తారు. కాని వారి వద్ద అలాంటి అనుమతి పత్రాలేవీ ఉండవు.

వ్యాపారంగా ప్రసిద్ధిగాంచిన కావలి పట్టణంలో ఆరు సినిమా హాల్స్ ఉన్నాయి. నిబంధనలకు అనుగుణంగా ఏ థియేటర్ కూడా నడవడం లేదు. అగ్నిమాపక యంత్రాలుండవు, పరిసరాలు శుభ్రంగా వుండవు, మరుగుదొడ్లు చూస్తే ఒకటే కంపు. ఇక హాళ్లలో అయితే అపరిశుభ్రత రాజ్యమేలుతుంటుంది. ఎయిర్ కూలర్లు ఆన్ చేస్తే సినిమాలోని సన్నివేశాలు కనిపిస్తాయేగాని డైలాగ్‌లు వినిపించవు. ఫ్యాన్లు అంతంత మాత్రంగా పని చేస్తుంటాయి. ఇంటర్వెల్‌లో తినుబండారాల రేట్లయితే అదిరిపోతుంటాయి. ఇవంతా ఒకెత్తయితే కొత్త సినిమా విడుదలైందంటే టిక్కెట్ల రేట్లు రెండింతలవుతున్నాయి. ప్రేక్షకులను నిలువునా దోచుకుంటున్నారు. కొత్త సినిమా మోజులో ప్రేక్షకులు కూడా అధికరేట్లు పెట్టి కొంటున్నారు. టిక్కెట్ల రేట్లు పెంచుకోవడానికి తామెలాంటి అనుమతులివ్వలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారుల అనుమతితోనే టిక్కెట్ల రేట్లు పెంచామని థియేటర్ల మేనేజర్లు అంటున్నారు. అయితే అధికారికంగా అనుమతి ఇవ్వనప్పుడు థియేటర్ల ముందు బోర్డులు పెట్టి మరీ టిక్కెట్ల ధరలు రెండింతలు చేసి అమ్ముతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రేక్షకులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఒక కౌన్సిలర్ కూడా ఈ టిక్కెట్ల దందాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు.

ఇటీవల 'బాహుబలి', 'శ్రీమంతుడు', 'బ్రూస్‌లీ', 'రుద్రమదేవి' వంటి చిత్రాలకు బాగా దండారు. రేపు 'అఖిల్' సినిమా రాబోతోంది. దానికి కూడా టిక్కెట్ల రేట్లు యధాఫలంగా పెంచబోతున్నారు. అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోకపోతే ఈ ప్రేక్షక దోపిడీ ఆగదు.

# హోదా అడిగితే దాడులా?



రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడిగిన కార్య కర్తలపై బీజేపీ వాళ్లు దాడులు చేయడం శోచనీయమని నెల్లూరు నగర యువజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కొమ్మి రాజేష్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు, ఏసి సెంటర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి నుండి ఒక ఓటు రెండు రాష్ట్రాలు అని చెప్పింది బీజేపీ వాళ్లేనని, ఆంధ్రాకు ప్రత్యేకహోదా ఇచ్చేది కూడా మేమే నని చెప్పి ఈరోజు మాట తప్పారన్నారు. ప్రత్యేకహోదా అడగడానికి వెళ్లిన వారిపై విజయవాడలో బీజేపీ వారు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు చక్రవర్ధన్‌రెడ్డి, ముజీర్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సుజాత, సాయి, సనత్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# అమోఘం... సుమేధ కూచిపూడి నృత్యం



భామనే... సత్యభామనేనంటూ జడ ఊపుకుంటూ వయ్యారంగా నడయాడుతూ కుమారి సుమేధ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని కరతాళ ధ్వనులు అందుకుంది. ఆదివారం కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమేధ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్థ తరపున ఉదయం నుండి సాయంత్రం వరకు శాస్త్రీయ నృత్య పోటీలు, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ర్యాగింగ్‌ను అరికట్టండి అనే అంశంపై కార్యక్రమం జరిగింది. పెసల జగదీష్ అధ్యక్షత వహించారు. దంతం రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ బాలాజీ ఆర్కెస్ట్రా వారిచే సంగీత విభావరి వీనులవిందుగా జరిగింది. పరమేశ్వరి నృత్యనికేతన్ అశోక్ పర్యవేక్షణలో చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ట్రస్ట్ అధ్యక్షులు కేతా సుబ్బారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

# విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలోని సర్వోదయ, డికెడబ్ల్యు కళాశాల విద్యార్థులు ఇబ్బందులకు గురౌతున్నారని, వారి సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలంటూ నెల్లూరుజిల్లా అదనపు జాయింట్‌కలెక్టర్ రాజ్‌కుమార్‌కు ఏపి దళిత విద్యార్థిసేన జిల్లా అధ్యక్షుడు అరవ పూర్ణప్రకాష్ సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టి.మేరి, పి.నరసింహులు పాల్గొన్నారు.

# శత్రువులవనున్న మిత్రులు

(మొదటి పేజీ తరువాయి)

శరవేగంగా ప్రయత్నించవచ్చు. బీహార్‌లో బీజేపీ ఓడిపోయినా ఏపిలో రెండు పార్టీల మధ్య తెగదెంపులు తప్పవు. అయితే ఇక్కడ అవకాశాన్ని చంద్రబాబు తీసుకుంటాడు. బీహార్‌లో బీజేపీ ఓడిపోతే నరేంద్ర మోడీ ప్రభావం పడిపోయినట్లే! కాబట్టి మోడీ ఇమేజ్‌తో ఇక అవసరం లేదు. కేవలం కేంద్రంతో బాగుంటే రాష్ట్రానికి నిధులొస్తాయనే ఒక్క ఆశతో కలిసుండాలి. కాని మోడీ వాలకం చూస్తే చంద్రబాబుకు ఏమీ ఇచ్చేటట్లు లేదు. ఇలాంటప్పుడు బీజేపీతో కలిసుంటే లాభం లేదు. అదీగాక బీజేపీతోనే పోతే మైనార్టీలు తెలుగుదేశంకు పూర్తిగా దూరమవుతారు. ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వలేదన్న కోపాన్ని ప్రజలు బీజేపీతో పాటు టీడీపీపై కూడా చూపిస్తారు. దీని బదులు బీజేపీకి దూరంగా జరిగి థర్డ్ ఫ్రంట్ నేతలతో కలవడమే ఆయనకు మేలు. భవిష్యత్‌లో థర్డ్ ఫ్రంట్‌కు అవకాశమొస్తే ప్రధాని రేస్‌లో ఆయన పేరు కూడా వుంటుంది. 1996లోనే చంద్రబాబుకు యునైటెడ్ ఫ్రంట్ తరపున అలాంటి అవకాశం వచ్చింది. ఆరోజు వదులుకున్నాడు. ఈరోజు రాష్ట్రంలో కొడుకు లోకేష్ అందుబాటులో వున్నాడు కాబట్టి కేంద్రంలో ఎటువంటి ఛాన్స్ వచ్చినా చంద్రబాబు వదులుకోడు. బీహార్‌లో బీజేపీ ఓడిపోవడం అంటూ జరిగితే మొదట నిరసనగళం విప్పేది, బీజేపీకి దూరమయ్యేది చంద్రబాబే! బీహార్ ఫలితాలు ఎలావున్నా అవి వచ్చిన తర్వాత మాత్రం బీజేపీ - టీడీపీల మధ్య ఎడబాటు తప్పదనేది రాజకీయ విజ్ఞుల అంచనా!

# గాంధీ సత్యాగ్రహ ఆశ్రమ అభివృద్ధికి కృషి

## - జిల్లా కలెక్టర్ యం.జానకి

నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని గాంధీ సత్యాగ్రహ ఆశ్రమ అభివృద్ధికి కృషిచేస్తానని నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు టౌన్‌హాలులో గ్రీట్‌వే ఇండో - అమెరికా నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చిన్నారుల మనస్సుల్లో దాగిన సృజనాత్మకతను ఆవిష్కరింపజేసేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. జిల్లాలోని చిన్నారుల్లో సైన్స్ పై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రాపంచిక జ్ఞానం పెంచేందుకు జిల్లా సైన్స్ మ్యూజియాన్ని త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అదే క్రమంలో పినాకిని సత్యాగ్రహ ఆశ్రమాన్ని ఆధునీకరిస్తున్నామన్నారు. ఆశ్రమానికి ప్రభుత్వం రూ.75లక్షలు మంజూరు చేసిందన్నారు. యుజిసి స్థాయిలో విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చేందుకు ఆశ్రమాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామన్నారు. గ్రీట్‌వే బ్రాండ్ అంబాసిడర్ డా॥ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమాన్ని మూడేళ్లలో మరో సబర్మతిలా తీర్చిదిద్దుతానన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెద్దపెద్ద సంస్థలను ఆశ్రయించి నిధులు సేకరించి గాంధీ ఆశ్రమాన్ని అద్భుత ప్రదేశంగా మారుస్తానని తన వంతుగా ఆశ్రమానికి రూ.10లక్షలు ఇస్తున్నానన్నారు. నెపస్మా జిల్లా అధ్యక్షుడు మైథిలి మనోహర్‌రెడ్డి, అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.వి.సుబ్బారెడ్డి, పినాకిని




ఆశ్రమ కమిటి నిర్వాహకులు గణేశం కృష్ణారెడ్డి, నెపస్మా నగర అధ్యక్షుడు శౌరిరెడ్డి ప్రసంగించారు. తొలుత విద్యార్థినులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. అనంతరం చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. కళాలయ ఆర్టిస్ట్ హరనాథ్ ప్రత్యేకంగా పెన్సిల్‌తో గీసిన జిల్లా కలెక్టర్ యం.జానకి చిత్ర పటాన్ని, రావి ఆకుపై గీసిన చిత్రాన్ని కలెక్టర్‌కు జ్ఞాపికగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు లక్ష్మి, రొంపిచర్ల శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవికి నివాళులు



ఆంధ్రప్రదేశ్ 59వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి అంతర్జాతీయ ఆర్యవైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడు కె.వి.చలమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్మాణం కానున్న శాసనసభ ఆవరణంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ట్రస్టు అధ్యక్షుడు కోట మధుసూదన్‌రావు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు నరశింహం, శరత్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, ఏల్చూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సిండికేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో 'వ్యవసాయ క్యాంపెయిన్'

వ్యవసాయ రంగానికి ఋణ సదుపాయం అందించడంలో సిండికేట్‌బ్యాంక్ దేశంలోనే ప్రప్రథమమైన అగ్రగామి బ్యాంకు అని సిండికేట్ బ్యాంకు నెల్లూరు రీజినల్ మేనేజర్ టి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడి సాధించడంలో వ్యవసాయ రంగానికి ఆర్థిక సహాయం ఎంతో అవసరమని గుర్తించి సిండికేట్ బ్యాంక్ దేశమంతటా అన్ని శాఖలలో కాంపయిన్ కార్యక్రమాన్ని ఈ నెల 1 నుండి 30వరకు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం వ్యవసాయ రంగంలో ఆర్థిక అవసరాలున్న రైతులకు సులభమైన వ్యవసాయ ఋణ సదుపాయాలు అందించడమేనన్నారు. బ్యాంకు శాఖల ఉద్యోగస్తులు ఈ క్యాంపయిన్‌లో క్రియాశీలకంగా వ్యవహరించి రైతుల యొక్క అవసరాలను గుర్తించి ప్రస్తుతం అమలులో వున్న పథకాలైన హైటెక్ వ్యవసాయం, పండ్ల పూల తోటలు, పట్టు పరుగులు, పశు సంవర్ధకం, చేపలు, రొయ్యలు, సేంద్రీయ వ్యవసాయం, వన, నేల, నీటి సంరక్షణ, నీటి పారుదల, తేనెటీగల పెంపకం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, పంటకోత తర్వాత అవసరాలకు, ఆగ్రోఫుడ్ ప్రాసెసింగ్, గ్రేడింగ్, అదనపు విలువ చేకూర్పు తదితర వాటి ద్వారా రైతు సోదరుల అవసరాలకు ఋణ పథకాలు రూపొందించారని పేర్కొన్నారు.

# 'కాపు' కాస్తున్న పార్టీలు

(మొదటి పేజీ తరువాయి)

కాబట్టే అధికారంలోకి రాగలిగాడు. విభజన తర్వాత ఏపిలో కాపులు బలంగా మారారు. క్రియాశీలకంగా వున్నారు. వాళ్లు ఎటు మొగ్గితే అటే అధికారం. గత రాజకీయ చరిత్రను పరిశీలిస్తే రాష్ట్రంలో కాపు, కమ్మ వర్గాలకు వైరం వుండేది. చంద్రబాబు అదృష్టం, జగన్ దరిద్రం కొద్ది ఈ రెండు వర్గాలు మొన్నటి ఎన్నికల్లో కలిసాయి.

దూరమైన కాపులను దగ్గర చేసుకునే ప్రయత్నాలకు జగన్ శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో ఆయనకు మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య వ్రాసిన పుస్తకం బాగా ఉపయోగపడింది. 1988 ప్రాంతంలో రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన విజయవాడ వంగవీటి రంగా హత్య వెనుక చంద్రబాబు పాత్ర వుందంటూ జోగయ్య తన పుస్తకంలో పేర్కొన్న అంశాలకు జగన్ 'సాక్షి' పత్రికలో విశేష ప్రచారం కల్పించారు. దీని ద్వారా కాపులను చంద్రబాబు మీదకు ఉసి గొల్పాలనేది ఆయన వ్యూహమై వుండొచ్చు. ముద్రగడ పద్మనాభం వంటి కాపు నాయకులు కూడా అప్పుడే చంద్రబాబుపై దండయాత్ర మొదలుపెట్టారు. జోగయ్య పుస్తకంలో వంగవీటి రంగా హత్య, చంద్రబాబు ప్రస్తావన తేవడం వల్ల ఎంతోకొంత తెలుగుదేశంకే నష్టం.

కాపులు ఎక్కడ జారిపోతారోనన్న భయంతో చంద్రబాబు వంగవీటి రంగా హత్య కథనాలు వచ్చిన పక్కరోజే వంద కోట్లతో కాపు కార్పొరేషన్‌ను ప్రకటించారు.

అయితే చంద్రబాబు మీద కాపులలో అప్పుడే అసంతృప్తి మొదలైనట్లు తెలుస్తోంది. ఈ రెండు సామాజికవర్గాల కాంబినేషన్ ఎక్కువ కాలం నిలవదని, కాబట్టి వారిని దగ్గర చేసుకునే ప్రయత్నాల్లో జగన్ ఉన్నాడని సమాచారం.

# మంత్రా... మజాకా!

(మొదటి పేజీ తరువాయి)

ఈ తీర్మానంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. అలాగే గూడూరులోనూ నారాయణ ఇంజనీరింగ్ కాలేజీని 1.65ఎకరాల ప్రభుత్వ భూమిలో కట్టారు. ఇప్పుడు ప్రభుత్వ భూమికి ప్రత్యామ్నాయంగా పెద్దగా విలువ లేని పోటుపాలెం పంచాయితీ పరిధిలో 77సెంట్ల భూమిని ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారు.

మంత్రిగా ఓ పక్క అమరావతి భూములను మింగుతున్నారు. రైతులను బెదిరించి మరీ భూములు తీసుకుంటున్నారు. సొంత జిల్లాలోనూ భూములపై పడ్డారు. అధికారంలోని మజాను ఈ విధంగా ఆస్వాదిస్తున్నట్లున్నారు.

### శెభాష్.. సాంప్రదాయాన్ని పాటించారు

# కుమ్ముకున్న కార్పొరేటర్లు



నెల్లూరు నగరానికి ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలాంటి కితాబిచ్చారో అందరం చూసాం. రాష్ట్రంలోనే ఇలాంటి వరెస్ట్ సిటీని ఎక్కడా చూడలేదన్నారాయన. మరి సిటీ ఇంత వరెస్ట్‌గా తయారు కావడానికి కారణం వరెస్ట్‌గా వున్న నగరపాలక సంస్థే కదా! నెల్లూరు నగరం ఎంత అధ్వాన్నంగా వుందో నెల్లూరు నగరపాలక సంస్థ అంతకంటే అధ్వాన్నంగా ఉందన్నది నిర్వివాదాంశం.

నెల్లూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం అంటే కేకలు, తోపులాటలు, కొట్లాటలు తప్పనిసరి! గత కొన్నేళ్లుగా కౌన్సిలర్లు గాని ఆ తర్వాత ముదిరి కార్పొరేటర్లు అయినవాళ్లు గాని ఈ సాంప్రదాయాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా వివేకా, అనూరాధ, పులిమి శైలజ, భానుశ్రీల కాలంలో కౌన్సిల్ సమావేశాలు బాహుబలి సినిమాలోని చివరి యుద్ధం సన్నివేశాన్ని తలపించేవి.

2014లో మేయర్ అబ్దుల్ అజీజ్ నాయకత్వంలో కొత్త పాలకవర్గం ఏర్పడడం జరిగింది. అయితే ఈ పాలక వర్గంలో కొత్త ముఖాలే ఎక్కువ. మొత్తం కౌన్సిల్‌లో ముగ్గురు మాత్రమే సీనియర్‌లు. మిగతా 51మంది కొత్తోళ్లే. వీళ్లకు కొట్టుకోవడం చేతకావడం లేదని, కార్పొరేషన్ సమావేశాలు మరీ చప్పగా వుంటున్నాయని ఆమధ్య కొందరు తెగ బాధపడిపోసాగారు. ఈ నెల 3వ తేదీన కౌన్సిల్ సమావేశం పెట్టారు. నగరంలో పారిశుధ్యం పడకేసి, విషజ్వరాలతో నెల్లూరులో ఆసుపత్రులు చాలక జనం చెన్నైలోని ఆసుపత్రులకు కూడా పరుగులు తీస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా నెల్లూరు అందాలను చూసి చీవాట్లు పెట్టాకనే ఈ కౌన్సిల్ సమావేశం పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. నగరంలో విషజ్వరాలు, పారిశుధ్య లోపం, పాలక వర్గం అక్రమాలపై ప్రతిపక్ష వైకాపా సభ్యులు అస్త్రశస్త్రాలు రెడీ చేసుకుని వచ్చారు. కౌన్సిల్ ఉదయం 11.25 గంటలకు మొదలైంది. మొదట మాజీరాష్ట్రపతి అబ్దుల్‌కలాం మృతి, అలాగే డెంగీ జ్వరం మృతులకు సంతాపం ప్రకటించారు. కౌన్సిల్‌హాల్‌కు కలాం పేరును పెట్టాలని తీర్మానించారు. అనంతరం వైకాపా సభ్యులు పారిశుధ్యం, జ్వరం వంటి అంశాలపై మాట్లాడుతున్న తరుణంలో 51వ డివిజన్ కార్పొరేటర్, మేయర్ అజీజ్ అనుచరుడైన ప్రశాంతి కుమార్ నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలంటూ ప్లకార్డును ప్రదర్శించారు. సభలో లేని ఎమ్మెల్యే ప్రస్తావన ఎందుకంటూ వైకాపా కార్పొరేటర్లు అతనిని అడ్డుకున్నారు. ఇక్కడ ఇరు పార్టీల వారు వాగ్వాదానికి ఆ తర్వాత తోపులాటకు దిగారు. ఈ సమయంలోనే అధికార పార్టీ కార్పొరేటర్ ఒకరు మీడియా పట్ల దురుసుగా ప్రవర్తించడంతో మీడియా ప్రతినిధులు ధర్నాకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని కార్పొరేటర్లకు సర్దిచెప్పి శాంతింపజేశారు. ఆ తర్వాత సమావేశం రాత్రి 7గంటల దాకా సాగింది. మొత్తానికి తాము కొత్త కార్పొరేటర్లమే అయినా సీనియర్లకు ఏ మాత్రం తీసిపోమని, నెల్లూరు కౌన్సిల్‌కున్న గబ్బు పేరును నిలబెట్టే వాడి వేడి తమకూ వుందని కొత్త కార్పొరేటర్లు చాటి చెప్పడం గమనార్హం.

# రోగాలను రమ్మన్నట్లుంది


### • పెద్దాసుపత్రి దుస్థితి చూసి కలెక్టర్ సీరియస్



పెద్దాసుపత్రి ప్రాంగణాన్ని చూస్తే రోగాలను బ్యానర్లు కట్టి స్వాగతిస్తున్నట్లుగా వుందని జిల్లా కలెక్టర్ యం.జానకి ఆగ్రహం వ్యక్తం చేశారు. 3వ తేదీ ఆమె నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీని, పెద్దాసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వార్డులను, వివిధ విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో వున్న చెత్తా చెదారం, పందుల మందలను చూసి కలెక్టర్‌కు కోపం తన్నుకొచ్చింది. ఈ ఆసుపత్రికి వస్తే రోగాలు పోయేటట్లు లేవని, కొత్త రోగాలొచ్చేటట్లుందని ఆగ్రహం చెందారు. మళ్లీ రెండ్రోజుల్లో వస్తానని, పరిస్థితులు మారకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించి, బ్లడ్‌బ్యాంక్‌ను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని ఆమె ఆదేశించారు.

**జీవితసత్యం:** గతంలో సీఎంలు వచ్చారు, ఈ ఆసుపత్రిని తనిఖీ చేశారు. కడుపు మండి తిట్టారు. అలాగే మంత్రులు, కలెక్టర్‌లు, జడ్పీ ఛైర్మెన్‌లు, వైద్యశాఖ కమిషనర్‌లు... ఇలా ఎందరో ఈ ఆసుపత్రిని తనిఖీ చేయడం, పరిస్థితులు మారకుంటే చర్యలు తప్పవంటూ గుడ్లురమడం చేసినవాళ్లే... చివరికి వీళ్లందరూ తమ పోస్టుల నుండి మారారు గాని ఈ పెద్దాసుపత్రి అందం మాత్రం మారలేదు... మారదు కూడా..!


## 85వ జయంతి



జననం: 08-11-1930 మరణం: 18-01-1995

## కీ॥ శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు

వ్యవస్థాపకులు

లాయర్

తెలుగు వారపత్రిక


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com